మధ్య తరగతికి ఊరట





కేంద్ర బడ్జెట్ కొన్నివర్గాలకు ఊరటనిచ్చింది. ఎంతో కాలంగా వేతన జీవులు, మధ్య తరగతి వర్గాలు ఎదురుచూస్తున్న ఆదాయ పన్ను(ఐటీ) పరిమితి పెంపు ఆకాంక్షను ఈసారి నెరవేర్చింది. ఊహించిన విధంగా పరిమితిని ఏకంగా రూ.12లక్షలకు పెంచుతూ శనివారం ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించారు. జలజీవన్ మిషన్ కాల పరిమితితోపాటు రైతులకు రాయితీ రుణపరిమితి పెంచారు. జీవిత కాలాన్ని పెంచే మందులపై పన్నులు తగ్గించడంతోపాటు పలు కీలక రంగాలకు ఊతమిచ్చే విధంగా కేటాయింపులు చేశారు. బడ్జెట్‌ను కూటమి పక్షాలు సమర్థిస్తుండగా.. రాష్ట్రానికి, జిల్లాకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవని ప్రతిపక్షాలు పెదవి విరుస్తున్నాయి.

- ఆదాయ పన్ను పరిమితి పెంపు
- ఉద్యోగ, వ్యాపార వర్గాలు హర్షం
- రైతుల రాయితీ రుణపరిమితి పెంపు
- వ్యవసాయ, పారిశ్రామిక, ఉపాధి రంగాలకు ఉపయుక్తం
- నిర్మలమ్మ బడ్జెట్‌ను సమర్థించిన కూటమి పక్షాలు
- ప్రత్యేక కేటాయింపులు లేవంటూ విపక్షాల పెదవి విరుపు



ఒంగోలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ కొంతమేరకు ఆశాజనకంగా ఉంది. ప్రధానంగా మధ్య తరగతికి ఊరటనిచ్చారు. ఆదాయపన్ను పరిమితి పెంపుపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి

మొత్తం రూ.50.65 లక్షల కోట్లతో 2025-26 వార్షిక బడ్జెట్‌ను మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టారు. సాధారణంగానే రక్షణ రంగానికి అధిక కేటాయింపులు చూపారు. వివిధ శాఖలకు తగు రీతిలో బడ్జెట్ కేటాయింపులు ఉండగా గతంతో పోల్చితే వ్యవసాయం, అనుబంధ రంగాలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందే వారికి ఉపశమనం కలిగేలా నిర్ణయాలు ప్రకటించారు. కేంద్రప్రభుత్వ బడ్జెట్‌ను బీజేపీ భాగస్వామ్య పార్టీలైన తెలుగుదేశం, జనసేనలు సమర్థిస్తుండగా రాష్ట్రానికి, జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేవంటూ విపక్షాలు విమర్శిస్తున్నాయి.

- వ్యక్తిగత రాయితీ ఉండే వ్యవసాయ రుణపరిమితి రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంపుతోపాటు పలు కొత్త పథకాలు, ఎంఎస్ఎంఈ కింద ఉదారంగా బ్యాంకు రుణాలు ఈ కోవలోకి రానున్నాయి.
- జలజీవన్ మిషన్‌ను గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించడంతో తాగునీటి పథకాల పనులు నిలిచిపోయాయి. ఆ పథకాన్ని మరో మూడేళ్లు పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. సముద్ర ఉత్పత్తులకు ప్రోత్సాహకాలు, ఇతరత్రా పథకాలు జిల్లా ప్రజలకు ఉపకరించనున్నాయి. ఇక రైల్వే, జాతీయ రహదారులు, ఇతర మౌలిక రంగాల అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యత ఇవ్వగా ఆయా రంగాలు, పథకాల ద్వారా జిల్లాకు కూడా మేలు జరగనుంది.
- అన్నింటి కన్నా అధికంగా ఐటీ పరిమితి పెంపుపై ఉద్యోగ, వ్యాపార వర్గాలలో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో ఆదాయ పన్ను గరిష్ఠ పరిమితి రూ.7లక్షలు, స్టాండర్డ్ డిడక్షన్ రూ.75వేలు ఉండగా ప్రస్తుతం పరిమితిని రూ.12లక్షలు పెంచడంతోపాటు స్టాండర్డ్ డిడక్షన్‌ను కొనసాగిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో వేతన జీవులు పెద్ద ఊరట పొందనున్నారు.

జిల్లాలో 50వేల మంది వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, మరో 20వేల మంది ప్రైవేటు ఉద్యోగులు, స్వయం ఉపాధి వ్యాపారులకు దీని వల్ల మేలు చేకూరనుంది.

సామాన్యులకు పెద్దపీట



కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, సామాన్యులకు పెద్దపీట వేశారు. అన్నిశాఖలు, అన్ని రంగాలకు సముచితంగా కేటాయింపులు ఉన్నాయి. వ్యవసాయానికి సంబంధించి పీఎం ధనధాన్య కృషి యోజన, కిసాన్ క్రెడిట్ కార్డుల రుణపరిమితి పెంపు, రైతులకు వడ్డీరాయితీ వంటివి కల్పించారు. విభజనతో, గత ప్రభుత్వ అస్తవ్యస్త చర్యలతో ఆర్థికలోటులో ఉన్న ఏపీకి ప్రత్యేకంగా అన్ని విషయాలలో న్యాయం చేస్తారని నమ్మకం ఉంది.

- మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎంపీ

అన్ని వర్గాలకు ఊరట



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాలకు ఊరట ఇచ్చేదిగా ఉంది. మధ్య తరగతి వర్గాలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఐటీ గరిష్ఠ పరిమితి రూ.12లక్షలకు పెంచడం సంతోషం. వ్యవసాయ, చిన్న పారిశ్రామిక వర్గాలు, ఆక్వా రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. జలజీవన్ మిషన్ గడువు పెంపుతో మన జిల్లాకు ఎంతో ఉపయోగం.

- దామచర్ల సత్య, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్


దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక



దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక ఈ బడ్జెట్. మధ్య తరగతి ప్రజలకు పన్ను మినహాయింపు గొప్ప విషయం. ప్రజా అనుకూలతను ప్రతిబింబించేలా నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా మహిళలు, పేదలు, యువత, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారు. జాతీయ శ్రేయస్సు దిశగా ఈ బడ్జెట్ కీలక అడుగులు సూచిస్తుంది.

- ముత్తుముల అశోక్‌రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే

రాష్ట్రానికి ఒరిగింది శూన్యం



కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగింది. ప్రధానంగా రాష్ట్రంలో నూతన ప్రాజెక్టులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం గురించి బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేదు. విభజన చట్టప్రకారం ఏపీకి నిధుల కేటాయింపు లేదు. రైతులకు ఈ బడ్జెట్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. వెనుకబడిన ప్రకాశంకు నిధులు కేటాయించలేదు. పోలవరం ఎత్తు తగ్గించడం అవివేకం.

- బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు

ఏపీకి మొండిచెయ్యి



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యిచూపింది. పోలవరం ప్రాజెక్టుకు కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే కేటాయింపులు చేయడం దారుణం. ఇలాగైతే ఎప్పటికి ఆ ప్రాజెక్టు పూర్తవుతుంది. పోలవరం ఎత్తును 45మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదించడం సమంజసం కాదు. ఇది ఢిల్లీ, బిహార్ ముందస్తు ఎన్నికల బడ్జెట్. మరోవైపు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ట్యాక్స్‌పేయర్లకు కొద్దిగా ఊరట కలిగించారు.

- షేక్ సైదా, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

ఊరూవాడ పండుగ

ఒక్కరోజే 90 శాతానికి పైగా పింఛన్ల పంపిణీ

- చిన్నఓబినేనిపల్లిలో పాల్గొన్న మంత్రి స్వామి
- ఇతరచోట్ల ముఖ్యనేతలు, అధికారులు హాజరు



బేస్తవారపేట మండలం చిన్నఓబినేనిపల్లిలో లబ్ధిదారుకు పింఛన్‌ను అందజేస్తున్న మంత్రి స్వామి, పక్కన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఒంగోలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వరుసగా ఎనిమిదో నెల కూడా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జిల్లాలో శనివారం ఉత్సాహంగా సాగింది. అన్ని ప్రాంతాల్లోనూ ఉదయం ఆరు గంటల నుంచే సచివాలయాల సిబ్బంది వారికి తోడుగా స్థానిక టీడీపీ నాయకులు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి లబ్ధిని అందజేశారు. కార్యక్రమంలో పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు ముఖ్యనాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 2.84 లక్షల మందికి రూ.123.31 కోట్లు మంజూరు కాగా శనివారం ఒక్కరోజే 90.36శాతం పంపిణీ చేశారు. అలా 2.57లక్షల మందికి రూ.110.99 కోట్ల మేర సాయంత్రం ఆరు గంటలలోపే అందజేశారు. మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి బేస్తవారపేట మండలంలోని చిన్న ఓబినేనిపల్లిలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒంగోలులోని ధారావారితోటలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డినగర్‌లో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మార్కాపురం పట్టణంలోని 10వవార్డులో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పంపిణీ చేశారు. పెద్దారవీడు మండలం శివరాంపురంలో టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు, దర్శి మండలం లంకోజనపల్లిలో దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పింఛన్‌లు అందజేశారు. ఇతర చోట్ల స్థానిక టీడీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాల్లో భాగంగా శనివారం ప్రముఖ కూచిపూడి నర్తకి వెంపటి శ్రీమయి చేసిన రుక్మిణీ కల్యాణం నృత్యరూపకం ఆకట్టుకుంది. ప్రముఖ నాట్య గురువు వెంపటి చినసత్యం వంశానికి చెందిన ఆమె ఆరు పదుల వయసులోనూ అబ్బురపరిచే నృత్యంతో ప్రేక్షకుల కరతాళధ్వనులను అందుకున్నారు.



వైసీపీ హయాంలో సర్వనాశనం

రిజర్వాయర్‌లోకి చేప పిల్లలను వదులుతున్న మంత్రులు గొట్టిపాటి, డోలా, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తదితరులు

- గుండ్లకమ్మ గేట్లు విరగ్గొట్టి ఇసుక తవ్వుకొని కోట్లు కొల్లగొట్టారు
- రూ.10కోట్ల ఖర్చుతో బాగుచేసిన కూటమి ప్రభుత్వం
- మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామి
- రిజర్వాయర్‌లో ఘనంగా మీనోత్సవం

వివరాలు 8వ పేజీలో

సినీ ఫక్కీలో పింఛన్ సొమ్ము చోరీ

- బైక్‌పై వస్తున్న ఉద్యోగిని అడ్డగించి రూ.2.68లక్షలు అపహరణ
- సచివాలయ ఉద్యోగుల్లో కలకలం
- అప్రమత్తమైన పోలీసులు
- రంగంలోకి డాగ్‌స్క్వాడ్

దొనకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ పంపిణీ చేసేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న సచివాలయ ఉద్యోగిని అడ్డుకొని సినీ ఫక్కీలో నగదు చోరీ చేసిన ఘటన మండలంలోని బాదాపురం గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని చందవరం గ్రామానికి చెందిన వీరంరెడ్డి రంగారెడ్డి మండలంలోని పెద్దన్నపాలెం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పంచాయతీ పరిధిలోని 58 మంది పింఛన్‌దారులకు సంబంధించిన రూ.2.68 లక్షల నగదును శుక్రవారం తీసుకొని సాయంత్రం తన స్వగ్రామమైన చందవరానికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున పింఛన్ నగదు పంపిణీ నిమిత్తం చందవరం నుంచి తన ద్విచక్ర వాహనంపై దొనకొండకు బయల్దేరారు. మార్గమధ్యంలో ముఖం కనబడకుండా కర్చీఫ్‌లు కట్టుకున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెల్ఫేర్ అసిస్టెంట్ రంగారెడ్డిని ద్విచక్ర వాహనంపై వెంబడించారు. బాదాపురం సమీపంలో అనువుగా ఉండటంతో అడ్డగించారు. అతన్ని కిందకు నెట్టేసి నగదు ఉన్న బ్యాగును లాక్కొని ద్విచక్ర వాహనంపై చందవరం వైపు వెళ్లిపోయారు. వెంటనే రంగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. త్రిపురాంతకం సీఐ హస్సాన్ హుటాహుటిన తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వెల్ఫేర్ అసిస్టెంట్ రంగారెడ్డిని సంఘటన జరిగిన తీరుపై విచారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒంగోలు నుంచి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి దొంగల ఆనవాళ్ల కోసం పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు.



ఘటనా స్థలంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రంగారెడ్డిని విచారిస్తున్న త్రిపురాంతకం సీఐ హస్సేన్, కురిచేడు ఎస్సై శివ

పింఛన్ డబ్బుతో సచివాలయ ఉద్యోగి పరార్

మార్కాపురం : పింఛన్లు పంపిణీ చేయాల్సిన సచివాలయ ఉద్యోగి ఆ మొత్తం సొమ్ముతో ఉడాయించిన వైనం శనివారం వెలుగుచూసింది. సుమారు 61 మందికి అందజేయాల్సిన రూ.2.66 లక్షలతో సదరు ఉద్యోగి పరారయ్యాడు. స్థానిక 10వవార్డులోని 18వ సచివాలయంలో పాలడుగు వెంకటేశ్వర్లు ఎమినిటీస్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. శనివారం రాజ్యలక్ష్మి కాలనీలో పింఛన్లు పంపిణీ చేసేందుకు శుక్రవారం రాత్రే అడ్మిన్ సెక్రటరీ కె.వెంకటేశ్వరరెడ్డి దగ్గర సంతకం చేసి నగదును తీసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం అవుతున్నా ఎవరికీ పింఛన్ సొమ్ము అందజేయలేదు. దీంతో అడ్మిన్ సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి విషయాన్ని మునిసిపల్ కమిషనర్ నారాయణరావు దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ వాట్సప్ ద్వారా టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పెరిగిన భూముల విలువ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): భూముల విలువ పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రభావం రిజిస్ట్రేషన్ చార్జీలపై పడింది. శనివారం నుంచి పెరిగిన విలువలు అమల్లోకి వచ్చాయి. ఈ మేరకు ఆన్‌లైన్‌లోనూ అప్‌డేట్ చేశారు. గత నెల 31న



ఒక్కరోజు ఆదాయం రూ.4.14 కోట్లు

అత్యధికంగా దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగాయి. జిల్లావ్యాప్తంగా ఒక్కరోజు 739 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా రూ.4.14కోట్లు ఆదాయం వచ్చింది. జిల్లాలో మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా జనవరిలో రూ.642 కోట్ల ఆదాయం వచ్చింది. రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు వలన 20 శాతం ఆదాయం పెరిగే అవకాశం ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఉన్న భూముల విలువలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచారు. 2019 ఆగస్టులో కేవలం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న భూములకు మాత్రమే విలువలు పెంచగా, 2023 జూన్‌లో నగర పంచాయతీలు, మున్సిపాలిటీలతోపాటు ఒంగోలు నగరం, కొన్ని ముఖ్యమైన గ్రామాలలో భూముల విలువను పెంచారు. ప్రస్తుతం జిల్లాలో అన్ని ప్రాంతాల్లో 10 నుంచి 20శాతం పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

త్రోవగుంట ప్రాంతంలో ఎకరా రూ.16.50లక్షలు ఉండగా ప్రస్తుతం రూ.17.50 లక్షలకు పెరిగింది. కొప్పోలు ప్రాంతంలో ఎకరా ప్రస్తుతం రూ.24లక్షలు ఉండగా రూ.26లక్షలకు పెంచారు. ముక్తినూతలపాడు ప్రాంతంలో ఎకరా రూ.40లక్షలు కాగా రూ.42 లక్షలకు పెంచారు. టంగుటూరులో ఎకరా రూ.12లక్షలు ఉండగా రూ.13లక్షలకు పెరిగింది. అల్లూరులో రూ.8 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచారు. ఒంగోలు నగరంలో లాయర్‌పేట, గోపాల్‌నగరం, రాజాపానగల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చదరపు గజానికి రూ.వెయ్యి చొప్పున భూముల విలువ పెరిగింది. పెరిగిన ధరలు శనివారం నుంచి అమల్లోకి వచ్చినట్లు జిల్లా రిజిస్ట్రార్ ఎ.బాలాంజనేయులు తెలిపారు.



అక్కడక్కడ పెచ్చులూడిపోయిన పాత రిమ్స్ భవనాల సముదాయం

బిక్కు-బిక్కుమంటూ..

- పాత రిమ్స్ భవనాల్లో ఉద్యోగుల విధులు
- పెచ్చులూడి పడుతున్న వైనం
- మరమ్మతులు శూన్యం

ఒంగోలులోని పాత రిమ్స్‌లోని భవనాల పెచ్చులూడి పడిపోతున్నాయి. ఇక్కడ గతంలో జిల్లా వైద్యశాల నిర్వహించేవారు. ఒంగోలుకు ప్రభుత్వ మెడికల్ కళాశాల రావటంతో జిల్లా వైద్యశాలను మార్కాపురానికి మార్చేశారు. ప్రభుత్వం వైద్య కళాశాలకు అనుబంధంగా వైద్యశాల కూడా కొత్త భవనంలో ఏర్పాటైంది. దీంతో పాత రిమ్స్ వైద్యశాల భవనాలన్నీ ఖాళీగా ఉండటంతో అధికారులు ఈ భవనాల్లోకి పలు ప్రభుత్వ కార్యాలయాలను మార్చారు. అయితే ఈ భవనాలు అధిక భాగం మరమ్మతులకు గురయ్యాయి. పెచ్చులూడి పడిపోతూ ప్రమాదకరంగా మారాయి. ఇలాంటి ప్రమాదభరితమైన భవనాల్లోనే ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు.

-ఒంగోలు నగరం, ఆంధ్రజ్యోతి



మరమ్మతులకు నోచుకోని తాగునీటి ట్యాప్



పెచ్చులూడిన ఉద్యానవనశాఖ కార్యాలయం భవనం

పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి
- రూ.6.50 కోట్లతో లెదర్ కర్మాగారం, నిర్మాణాలకు భూమిపూజ
- పాల్గొన్న లిడ్‌క్యాప్ చైర్మన్ మాణిక్యాలరావు



రోడ్డు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి డోలా, ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికంగా పశ్చిమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం రాచర్ల మండలం యడవల్లి లెదర్‌పార్కు వద్ద రూ.6.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భవనాలు, రోడ్డు నిర్మాణాలకు లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి మంత్రి బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న లెదర్‌పార్కు పేదలకు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా ఇప్పటివరకు రూ.6.50 కోట్ల పెట్టుబడులను ఈ ప్రాంతానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. పునరుత్పాదన, విద్యుత్ ప్రాజెక్టును కనిగిరి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లిడ్‌క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలు పరిశ్రమలు స్థాపించుకునేందుకు ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం పిల్లి మాణిక్యాలరావు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ఇక్కడ లెదర్‌పార్కును ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పరిశ్రమ నిర్మాణానికి రూ.5.75 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ప్రధాన రహదారి నుంచి పార్కు వరకు మరో రూ.70లక్షలతో రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో 25 ఎకరాల స్థలం ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. దీని ద్వారా పలు అనుబంధ పరిశ్రమలు కూడా ఇక్కడికి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం కోరితే పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖలకు ఇక్కడి నుంచే బూట్లు, ఇతర లెదర్ ఉపకరణాలు అందించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ చర్మకారులు ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో తోళ్లను శుద్ధి చేసే యూనిట్ కూడా ఇక్కడ స్థాపించి వారి అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని కోరారు. లెదర్ పార్క్, రహదారి శిలాఫలకాలను మంత్రి స్వామి, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ పి.భాస్కర్‌బాబు, ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సదరమ్ క్యాంపు ఏర్పాటు

- పరిశీలించిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



సదరమ్ క్యాంపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైద్యఆరోగ్యశాఖ అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో రెండవ విడత నిర్వహించనున్న సదరమ్ క్యాంపు ఏర్పాట్లను జిల్లా వైద్యఆరోగ్యశాఖ, జీజీహెచ్ వైద్యాధికారులు శనివారం పరిశీలించారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీనాయక్‌తో కలిసి ఇతర వైద్యాధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సదరమ్ క్యాంపులో దివ్యాంగులకు అవసరమైన తాగునీరు, కుర్చీలు, వేచి ఉండేందుకు ప్రత్యేక రూములు, తదితర సదుపాయాలు కల్పించాలని సూచనలు చేశారు. వైద్యపరీక్షలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సూరిబాబు, ఇన్‌చార్జి ఆర్‌ఎంవో డాక్టర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వీరమరణం సన్నివేశంలో విద్యార్థులు



భగత్‌సింగ్‌ను ఖైదు చేస్తున్న సన్నివేశంలో విద్యార్థులు

జయహో భగత్‌సింగ్

- అలరించిన దేశభక్తి ప్రదర్శన
- వెంపటి శ్రీమయి కూచిపూడి నృత్య ప్రదర్శన
- నేడు హాజరుకానున్న పురంధేశ్వరి, ఇతర ప్రముఖులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ కళాపరిషత్ వేదికపై శనివారం స్థానిక అపెక్స్ స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన సర్దార్ భగత్‌సింగ్ నృత్య ప్రదర్శన ఔరా అనిపించి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దేశ స్వాతంత్ర్య సమరంలో జలియన్ వాలాబాగ్ ఉదంతంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాటపటిమ తుదకు అతడిని కుట్రలు కుతంత్రాలతో హతమార్చటం వంటి సన్నివేశాలను విద్యార్థులు అద్భుతంగా ఆవిష్కరించారు.

ఆరు పదుల వయసులోనూ..

ఇక చెన్నయ్ కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆరు పదుల వయస్సు కలిగిన ప్రముఖ కూచిపూడి నర్తకి శ్రీమయి చేసిన రుక్మిణీ కల్యాణం నృత్యరూపకం అబ్బురపరచింది. ప్రముఖ నాట్య గురువు వెంపటి వంశానికి చెందిన ఆమె రుక్మిణీ కల్యాణ ఘట్టాన్ని తన నృత్యం ద్వారా సాక్షాత్కరించింది. నాదస్వర కచేరి, కోలాట ప్రదర్శనలు సైతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

నేడు పలువురు ప్రముఖులు హాజరు

ఎన్టీఆర్ కళాపరిషత్ ముగింపు సభలో ఆదివారం రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, లోక్‌సత్తా అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ, స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొననున్నారు.



కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు



ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కొనగానివారిపాలెం హైస్కూల్లోని, హెచ్‌ఎం, ఉపాధ్యాయుల పనితీరుపై డీఈవో కిరణ్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం కొనగానివారిపాలెంలోని జడ్పీహైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సక్రమంగా లేని మధ్యాహ్నం భోజనం, హైస్కూల్ ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువులకు సంబంధించి ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవన్నారు. విద్యాప్రమాణాలు తగ్గితే ఎలా అని ప్రశ్నించారు. చాలీచాలని మధ్యాహ్నం భోజనం, రుచికరంగా లేకపోవడంపై హెచ్‌ఎం గుణప్రసాద్, ఉపాధ్యాయుల బాధ్యతరాహిత్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజు నోటీసును జారీ చేశారు. ఎంఈవో వెంకారెడ్డిని హైస్కూలును సందర్శించి నివేదిక సమర్పించాలని డీఈవో ఆదేశించారు.


వైసీపీ హయాంలో సర్వనాశనం

- గుండ్లకమ్మ గేట్లు విరగ్గొట్టి ఇసుక తవ్వుకొని రూ.కోట్లు కొల్లగొట్టారు
- రూ.10కోట్ల ఖర్చుతో బాగుచేసిన కూటమి ప్రభుత్వం
- మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామి
- రిజర్వాయర్‌లో ఘనంగా మీనోత్సవం

మద్దిపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గత ఐదేళ్ల గుండ్లకమ్మను సర్వనాశనం చేసిందని, గేట్లు విరగొట్టి ఇసుక అక్రమ తవ్వకాలతో ఆ పార్టీ నేతలు కోట్లు కొల్లగొట్టారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. శనివారం గుండ్లకమ్మ ప్రాజెక్టులో మీనోత్సవం నిర్వహించారు. 20.65లక్షల చేపపిల్లలను మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌లు కలిసి రిజర్వాయర్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.10కోట్లు ఖర్చుతో గేట్లు అమర్చుతుందని పేర్కొన్నారు. అతి త్వరలో గుండ్లకమ్మ నిర్వాసితులకు ఇళ్లస్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి రవికుమార్ స్పష్టం చేశారు. తుంగభద్ర గేట్ల విషయంలో చంద్రబాబునాయుడు చేపట్టిన చర్యలు చరిత్రలో మిగిలిపోతాయని కొనియాడారు. అటు కర్ణాటక ప్రభుత్వం చేతులు ఎత్తేసినా కానీ మన మంత్రులు రామానాయుడు, పయ్యావుల కేశవ్ యుద్ధపాతిపదికన నిపుణుడు కన్నయ్యతో కలిసి వెళ్లి గేట్లు బిగించి కర్నూలు రైతాంగాన్ని కాపాడారని తెలిపారు. మంత్రి డీఎస్‌బీవీ స్వామి మాట్లాడుతూ వైసీపీ హయాంలో పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు దెబ్బతిని పోగా, అన్నమయ్య ప్రాజెక్టు ఏకంగా కొట్టుకుపోయిందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో గేట్లు కొట్టుకుపోయి అపారనష్టం జరిగిందని తెలిపారు. లక్షలాది మత్స్యసంపద కూడా పోయిందని, రైతుల పొలాలు ఎండిపోయాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గేట్ల మరమ్మతులతోపాటు ఒంగోలుకు తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పాలకులు ఇసుక దోపిడీ చేశారన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం సబ్సిడీతో వలలను, ఐసు బాక్సులను అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎఫ్‌వోలు శ్రీనివాసులు, బెల్లంకొండ కృష్ణకిశోర్, ఎఫ్‌డీవో సుభాషిణి, తహసీల్దార్ సుధీర్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో వరప్రసాద్, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు వీరయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంతిబాబు, నర్ర సురేష్, మండవ గోపిచంద్, చింతల శ్రీనివాసరావు, వరహాలచౌదరి, మార్నేని రాఘవరావు, నర్రా సురేష్‌బాబు పాల్గొన్నారు.

మహంకాళమ్మ అమ్మవారి సన్నిధిలో మాజీ డీజీపీ

- కుటుంబ సభ్యులతో కలిసి పూజలు
- పూర్ణకుంభంతో ఘన స్వాగతం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ద్వారకా తిరుమలరావు కుటుంబం

జాగర్లమూడి (పర్చూరు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం, పెద్దజాగర్లమూడిలో వెలసిన శ్రీ ఉజ్జయిని మహంకాళమ్మ అమ్మవారిని రాష్ట్ర మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న డీజీపీ దంపతులను గ్రామపెద్దలు ధూళిపల్లి వెంకటస్వామి, తనయుడు వెంకటేష్ నేతృత్వంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వారిచే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. డీజీపీగా ఉద్యోగ విరమణ చేసిన తిరుమలరావు తల్లి స్వగ్రామం పెద్ద జాగర్లమూడి కావడంతో శ్రీ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు తీసుకున్న అనంతరం ద్వారకా తిరుమలరావు దంపతులను యువ పారిశ్రామికవేత్త ధూళిపల్లి వెంకటేష్ దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆయన్ని చూసేందుకు గ్రామస్థులు ఆలయానికి వచ్చారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ డీపీ విఠలేశ్వర్, డీఎస్పీ రామాంజనేయులు, మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు, ఎస్సై మాల్యాద్రి, నేతలు మక్కెన శేఖర్‌బాబు, కారుమంచి కృష్ణ, నెహేమియారావు, మామిడిపాక హరిప్రసాద్, లక్కిపోగు సుమన్, బుల్లెట్ శ్రీను, షేక్ గౌస్ పాల్గొన్నారు.



మంత్రి రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పీపీ గొట్టిపాటి శ్రీనివాసరావు, ఇతర న్యాయవాదులు

పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గొట్టిపాటి శ్రీనివాసరావు

మంత్రి గొట్టిపాటిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన న్యాయవాది



జి.శ్రీనివాసరావు (ఫైల్)

అద్దంకి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అద్దంకికి చెందిన న్యాయవాది గొట్టిపాటి శ్రీనివాసరావును ఉమ్మడి ప్రకాశం జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వం నియమించింది. శనివారం ముప్పవరం టీడీపీ కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను పీపీ గొట్టిపాటి శ్రీనివాసరావు ఇతర న్యాయవాదులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసి వారిలో న్యాయవాదులు నాదెండ్ల దశరథరామయ్య, బత్తుల రామకోటయ్య, శ్రీనివసారావు, రమణయ్య శ్రీహర్ష, నాగేశ్వరమ్మ, సత్యవతి, అనూష తదితరులు ఉన్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఒంగోలులో శ్రీనివాసరావు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

నగరవనం ఏర్పాటుకు స్థల సేకరణ

- అద్దంకి కొండ ప్రాంతంలో పరిశీలించిన అధికారులు



అద్దంకి కొండ వద్ద పరిశీలిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి భీమయ్య, తహసీల్దార్ శ్రీచరణ్

అద్దంకి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టబోయే నగరవనంను అద్దంకి పట్టణంలో ఏర్పాటుకు సంబంధించి శనివారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. జిల్లా అటవీ శాఖ అధికారి భీమయ్య, తహసీల్దార్ శ్రీచరణ్ శనివారం అద్దంకి కొండ వద్ద స్థలాన్ని పరిశీలించారు. నగరవనం ఏర్పాటుకు సుమారు 50 హెక్టార్ల భూమి అవసరం అని డీఎఫ్‌వో భీమయ్య తెలిపారు. అయితే అద్దంకి కొండ వద్ద సుమారు 18 హెక్టార్ల కొండ భూమి మాత్రమే ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గుండ్లకమ్మ నది పరీవాహక ప్రాంతంలో కూడా సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఆర్ఐ శంకర్, సర్వేయర్ శ్రీలక్ష్మి ఉన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

● నివాళులర్పించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ పని చేస్తున్న పి.కిరణ్‌బాబు(50) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రెండు రోజుల క్రితం గ్యాస్ట్రబుల్ అని చెప్పి ఒంగోలులోని ఓ ఆసుపత్రికి వెళ్ళగా అక్కడ వైద్యం చేసి శనివారం 10 గంటలకు డిచార్జి చేస్తామని డాక్టర్లు చెప్పారు. అయితే కిరణ్‌బాబు ఉదయం 7.15 సమయంలో గుండెపోటుతో చనిపోయారు. కిరణ్‌బాబు స్థానిక జక్రయ్య ఆసుపత్రి సమీపంలో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ మృతి సమాచారం తెలుసుకున్న ఎస్పీ దామోదర్ వెళ్ళి ఆయన మృతదేహంపై పూలమాల ఉంచి ఘనంగా నివాళి అర్పించారు. కిరణ్‌బాబు కుటుంబ సభ్యులను ఓదార్చి, పోలీస్‌శాఖ అండగా ఉంటుదని సంతాపం వ్యక్తం చేశారు. అయిన వెంట వన్‌టౌన్ సీఐ నాగరాజు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

మోటార్ సైకిళ్లు ఢీ.. నలుగురికి గాయాలు

కొండపి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈఘటన కొండపి-పెరిదేపి గ్రామాల మధ్య శనివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. ముగ్గురు యువకులు కొండపి నుంచి పెరిదేపి వైపు మోటారు సైకిల్‌పై వెళ్తున్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు అంగలకుర్తి సూరిబాబు పెరిదేపి నుంచి కొండపికి మరో బైక్‌పై వస్తున్నారు. రెండు గ్రామాల మధ్యకు వచ్చే సరికి మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. దీంతో నలుగురికీ గాయాలయ్యాయి. ఎవరికి వారు చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లారు. రెండో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకుల సమాచారం తెలియరాలేదు. ప్రమాద విషయం తెలిసిందని, విచారిస్తున్నామని ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగ నియామక పత్రాల అందజేత


నియామకపత్రం అందజేస్తున్న చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కారుణ్య నియామకం కింద ముగ్గురికి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఉద్యోగ నియామక పత్రాలను శనివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈపూరుపాలెం జడ్పీహ హైస్కూలు(బాలుర)లో స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తూ శ్రీనాథ్ మృతి చెందగా ఆయన భార్య ధనలక్ష్మికి చీరాల ఎంపీడీవో కార్యాలయంలో, దొనకొండ మండలం ఎర్రబాలెంలో ప్రాథమికపాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తూ మరణించిన శిరీష మృతి చెందగా సోదరుడు జవంగుల మల్లికార్జునకు కురిచేడు మండల పరిషత్ కార్యాలయంలో, కొత్తపట్నం మండలం అల్లూరు జడ్పీ హై స్కూలులో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ మరణించిన బోలా అంజనేయులు భార్య గంటా సుబ్బరావమ్మకు ఒంగోలు పరిషత్ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్లుగా నియమిస్తూ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో చిరంజీవి, జిల్లా పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఉలిచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని కమ్మవారి సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక స్కూలులోని టెన్త్ విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే టెన్త్ పరీక్షల్లో 500 మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.25వేలు నగదును బహుమతిగా స్కూలుకు అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో చుంచు శేషయ్య, మండవ సుబ్బారావు, పిల్లుట్ల సుధాకర్, దుగ్గినేని వెంకట్రావు, హెచ్‌ఎం కోటేశ్వరరావు, చుంచు శింగయ్య, నన్నపనేని వెంకట్రావు, వాసుబాబు, వై.నరసింహారావు, వై.వెంకటశేషయ్య, బోయిడి ఆంజనేయులు, మండవ మల్లికార్జున్ పాల్గొన్నారు.


5న ఫీజుపోరు ర్యాలీని జయప్రదం చేయాలి

● వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవిబాబు, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5వ తేదీన ఒంగోలులో జరిగే ఫీజు పోరు నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చివరకు విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు కూడా చెల్లించని పరిస్థితి ఏర్పడిందన్నారు. పరీక్షల సమయం సమీపిస్తున్నా కాలేజీలకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో హాల్ టిక్కెట్లు కళాశాలల యాజమాన్యాలు ఇవ్వరని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఫీజు పోరు ర్యాలీలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కఠారి శంకర్, బోట్లా సుబ్బారావు, ఇమ్రాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో చిరంజీవి

పొన్నలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జడ్పీ సీఈవో చిరంజీవి శనివారం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యాలయ నిర్వహణ, ఇతరత్రా అంశాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీవో సుజాతతో సమీక్షించారు. చెన్నిపాడులో ప్రభుత్వం తరఫున అర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు కేటాయించిన స్థలం జడ్పీ స్కూల్ ఆట స్థలమని వివాదం రావడంతో దాన్ని సీఈవో పరిశీలించారు. కె.అగ్రహారంలో సీపీడబ్ల్యూఎస్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్, పైపులైను పనులను ఆయన చూశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద సీఈవోను కలిసిన టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో అంతర్గత సీసీ రోడ్లు మంజూరు చేయాలని, వర్షాకాలంలో కార్యాలయాలు నీటిలో ఉంటున్నాయని, మెరకలు తోలాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం


గాంధీరోడ్డులో ఏర్పాటు చేసిన వాహనాల సెంటర్ పార్కింగ్

నగరంలోని గాంధీరోడ్‌లో నిత్యం రద్దీ ఉంటుంది. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గత కొన్నేళ్ళుగా ఆ ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవగా, నిరంతరం ట్రాఫిక్ స్తంభిస్తున్నది. ఈ సమస్య పరిష్కారం కోసం ట్రాఫిక్ పోలీసులు సెంటర్ పార్కిం గ్ విధానం ఏర్పాటు చేశారు. దీంతో సమస్యకు కొంత పరిష్కారం లభించి నట్లయింది.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

ప్రశ్నార్థకంగా పంట కాలువల ఉనికి

కొన్నిచోట్ల ఆక్రమణలు

నిర్వహణ లోపంతో ఆనవాళ్లు కోల్పోయిన మరికొన్ని..


ధ్వంసమైన మర్రిపూడి చెరువు తూముకాలువ

మర్రిపూడి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ఇరిగేషన్ చెరువుల పరిధిలో ఉన్న పంట కాలువలు ఉనికి కోల్పోతున్నాయి. ఇటీవల చెరువులకు సంవృద్ధిగా నీరు చేరకపోతుండటంతో పంట కాలువలు వినియోగంలో లేకుండాపోయాయి. ముఖ్యంగా మర్రిపూడి చెరువు అలుగుపారి 20 సంవత్సరాలు దాటింది. చెరువు కింద వరి సాగు చేయడం అన్నదాతలు మర్చిపోయారు. గత కొన్నేళ్లుగా మాగాణి భూముల్లో మెట్ట పైర్లు సాగు చేస్తున్నారు. ఏళ్ల తరబడి సాగుకు నోచుకోకపోవడంతో పంట కాలువలు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో వల్లయిపాలెం చెరువు కట్టకింద ఉన్న పంట కాలువలను రైతులు ఇరువైపులా ఆక్రమించుకొని తమ భూముల్లో కలుపుకున్నారు. అప్పట్లో నిర్మించిన సిమెంట్ లైనింగ్ మొత్తం పగిలిపోయింది. పలుగ్రామాలలో తూములు పనిచేయక నిరుపయోగంగా మారాయి. గత వైసీపీ పాలనలో కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఆర్‌ఆర్ పథకం కింద మండలంలోని ఏడు చెరువుల అభివృద్ధికి రూ3 కోట్లకుపైగా మంజూరు చేసినప్పటికీ ఒక్క నర్సాపురం చెరువు పనులు మాత్రమే 70శాతానికి పైగా పూర్తయ్యాయి. వేమవరం నారపనాయుడి చెరువు పనులు కొద్దిమేర జరిగాయి. గంగపాలెం చెరువు మరమ్మతులు 40శాతానికిపైగా చేయగలిగారు. అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. మర్రిపూడి, గుండ్లసముద్రం, చిమట చెరువుల పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు అసలు ఆవైపే చూడలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాలువలు, తూములు, చెరువ కట్టల పటిష్టతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఉన్న వాటికే రాయి లేకపోతే.. కొత్త వాటికి అనుమతులా..

అధికారులు ఆలోచించాలని ఫ్యాక్టరీ ఓనర్ల వినతి ● చీమకుర్తిలో నాలుగు అసోసియేషన్ల నాయకుల అత్యవసర సమావేశం


సమావేశంలో పాల్గొన్న ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

చీమకుర్తి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇపుడు ఉన్న దాదాపు 800 ఫ్యాక్టరీలకు ముడిరాయి దొరక్క ఇబ్బందిపడుతుంటే ఉత్తరాది నుంచి విచ్చేసిన ట్రేడర్లు శ్లాబుల కొనుగోలుకే పరిమితం కాకుండా కొత్తగా కటింగ్ ఫ్యాక్టరీలు పెట్టి స్థానికంగా ఉపాధి పొందుతున్న వారిని ఉద్దేశ్యపూర్వకంగా దెబ్బతీస్తున్నారని, అయితే వారికి అధికారులు వత్తాసు పలుకుతూ అనుమతులు మంజూరు చేస్తుండటంపై గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ ఫ్యాక్టరీ ఓనర్లలో ఆందోళన వ్యక్తం అయింది. ఇప్పటికే శ్లాబులకు తగిన గిట్టుబాటు ధర లేక ఉత్పత్తి ఖర్చులు కూడా రాక, ముడిరాయికి గిరాకీ పెరిగిందని, నాణ్యమైన ముడిరాయి మృగ్యమై కరెంట్ బిల్లులు, బ్యాంక్ కిస్తీలే సరిగ్గా కట్టలేని స్థితిలో ఉన్న ఫ్యాక్టరీ ఓనర్లకు ఉత్తరాది నుంచి వచ్చి నూతనంగా భారీస్థాయిలో ఫ్యాక్టరీ నిర్మాణాలను చేపడుతుండటం మింగుడుపడ లేదు. అనుకోని ఈ విపరీత పరిణామానికి బిత్తరపోయిన చీమకుర్తి, బూదవాడ, ఆర్‌ఎల్.పురం, ఏలూరురోడ్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ ముఖ్య నాయకులు శనివారం రాత్రి చీమకుర్తి అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ పరిణామాలను ఎదుర్కోవటంపై చర్చించారు. ఈనెల మూడో తేదీన ఓనర్ల అందరితో విస్తృతిస్థాయి సమావేశాన్ని రామతీర్థం వీటీసీ సెంటర్‌లో నిర్వహించి పోరాట కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు యర్రగుంట శ్రీనివాసరావు, కాట్రగడ్డ రమణయ్య, లగడపాటి శ్రీనివాస్, మలినేని వెంకటేశ్వర్లు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, భవాని ప్రసాద్, ఉన్నం సుబ్బారావు, బొమ్మిశెట్టి మధు, నూకల సురేంద్ర, అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

90శాతానికి పైగా పింఛన్ల పంపిణీ

● కొన్నిచోట్ల సర్వర్ సమస్యతో జాప్యం


నాగిరెడ్డిపాలెంలో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న మండల ప్రత్యేక అధికారి వరలక్ష్మి, అధికారులు

కొండపి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పింఛన్‌ల పంపిణీ శనివారం ముమ్మరంగా సాగింది. తొలిరోజు కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో 90శాతానికిపైగా లబ్ధిదారులకు సొమ్మును అందజేశారు. వేకువజామున 5 గంటలకే పంపిణీ ప్రారంభించగా కొన్నిచోట్ల సర్వర్ సమస్య ఎదురైంది. దీంతో కొంత జాప్యం జరిగింది. కొండపిలో పింఛన్‌ల పంపిణీని మూడు నెలల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు అప్పగించారు. వారి వద్ద గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లే ఉండటం, అవి అప్డేట్ కాకపోవడంతో పంపిణీ కార్యక్రమం నెమ్మదిగా సాగింది. బయోమెట్రిక్ మిషన్‌లు కూడా అందుబాటులో లేకపోవడంతో లబ్ధిదారులైన వృద్ధుల ముఖచిత్రాలు నమోదు కాక పింఛన్‌లు ఇచ్చేవారు ఇబ్బంది పడ్డారు. పొన్నలూరు మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్‌ల పంపిణీ జరిగింది. మండల ప్రత్యేకాధికారి, ఇరిగేషన్‌శాఖ ఒంగోలు సర్కిల్ ఎస్‌ఈ డి.వరలక్ష్మి పలు గ్రామాల్లో పాల్గొని పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు మండవ ప్రసాద్, మండవ మురళి, ఎంపీటీసీ సభ్యురాలు గంధం స్వప్న, పొన్నలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ముప్పరాజు నారాయణ పాల్గొన్నారు. జరుగుమల్లి మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్‌లను అధికారులు, నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో రమణమూర్తి పర్యవేక్షించారు.

భర్త చనిపోయిన మరుసటి నెలలోనే పింఛన్ అందజేత

మర్రిపూడి: కూటమి ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం మేరకు మండలంలోని చిమటలో ఓ వితంతు మహిళకు భర్త చనిపోయిన మరుసటి నెలలోనే పింఛన్ మంజూరైంది. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన చింతగుంట్ల సాల్మన్ గత నెలలో మృతి చెందారు. ఆయన భార్య పుష్పమ్మకు శనివారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గాలేటి ప్రసాద్ పింఛన్ అందజేశారు. ఎటువంటి వ్యయప్రయాసలకు లోనుకాకుండా నేరుగా ఇంటివద్దకు వచ్చి పింఛన్ ఇవ్వడంతో పుష్పమ్మ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య, కోటయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, బసవయ్య పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మండలంలో శనివారం కోలాహలంగా సాగింది. ఉదయాన్నే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను నగదును అందజేశారు. ఉప్పుగుండూరులో జరుగుతున్న పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీ వై.మహాలక్ష్మి పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు పింఛను నగదు అందజేశారు. గ్రామాల్లో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది చేతుల మీదుగా అందించారు.

పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించాలి

● ఎంపీపీ వాకా అరుణ

మద్దిపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు, మండల స్థాయిలోని అధికారులు ప్రొటోకాల్ పాటించాలని ఎంపీపీ వాకా అరుణ పేర్కొన్నారు. శనివారం మద్దిపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖ చేపడుతున్న అభివృద్ధి పనులు, రోడ్లు, సైడు కాలువలు నిర్మాణం తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. మల్లవరం సర్పంచ్ నారా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ పంచాయతీలోని చిన్నమల్లవరం నుంచి బోయపాటి వారికుంట వరకు డొంకలో ఉపాధి హామీ ద్వారా నిర్వహించిన జంగిల్ క్లియరెన్స్ బిల్లులు అడుగుతున్నా కూడా ఇవ్వట్లేదని ఏపీవో ధనుంజయవర్మను నిలదీయగా త్వరలోనే పనిచేసి పెడతానని చెప్పారు. ఉపాధి పథకం ద్వారా చేపడుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణంలో లెవెలింగ్‌లో జాబ్‌కార్డు పొందిన వ్యక్తులు ద్వారా పని చేయించకుండా అన్ని చోట్ల మిషనరీ ద్వారానే పనిచేస్తున్నారని పలువురు సర్పంచులు ప్రశ్నించారు. గ్రామపంచాయతీల్లో సర్పంచులకు తెలియకుండానే అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ దృష్టికి తీసుకురాగా తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని ఎంపీపీ ఆదేశించారు. దొడ్డవరప్పాడు సర్పంచ్ బెజవాడ రాము, ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకటరావు తమ గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజన్ కుమార్, సర్పంచ్‌లు దాసరి శిల్పసౌందర్య, రావిపాటి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు నిధులు కేటాయించక పోవటం అన్యాయం

● సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిం కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటం అన్యాయంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు విమర్శించారు. శనివారం ఒంగోలులో ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా వెనకబడిన ప్రాంతంగా గుర్తించి నిధులు ఇవ్వలేదని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సవరణ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేసేలా చూడాలని డిమాండ్ చేశారు.

'ప్రకాశం' ఎక్కడా..?

గతంలో వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశంను చేరుస్తున్నట్లు ఇచ్చిన హామీని నిర్మలా సీతారామన్ విస్మరించారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాలకు కేటాయించాల్సిన నిధులను ఇవ్వడం ఆంధ్ర కోడలు మర్చిపోయారని, పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడంతోపాటు నిధులు కేటాయింపు కూడా అంతంతమాత్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో సాగు, తాగునీరు అవకాశాలపై కేంద్రం నీళ్ల చల్లగా, రాయలసీమలో రిజర్వాయర్ ఏర్పాటు చేసి పోలవరం నీటిని తరలించి ఆయా జిల్లాల సాగునీటి ప్రయోజనాలను నెరవేర్చే కల కలగానే మిగలనుందని ఆరోపించారు.

పేదలకు ఉపయోగం లేని బడ్జెట్

ఒంగోలు కలెక్టరేట్: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద వర్గాలకు ఎటువంటి ఉపయోగం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధిచి ట్టిపాటి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రైతులకు ఎటువంటి హామీ దక్కలేదన్నారు.

సామాజిక అంతరాలు పెంచేలా ఉంది..

కేంద్రబడ్జెట్ సామాజిక అంతరాలను పెంచేలా ఉందని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు ఆరోపించారు. కార్మిక, మధ్య తరగతి వర్గానికి వ్యతిరేకంగా ఉందని ఆయన విమర్శించారు.

విద్యకు ప్రాధాన్యత ఏది..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.5శాతం నిధులు మాత్రమే కేటాయించారని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధానకార్యదర్శి బి.వెంకట్రావు, గౌరవాధ్యక్షుడు అమ్మయ్య, కార్యదర్శి బి.అశోక్‌కుమార్, ఐపీయా కౌన్సిలర్లు ఎం.రాఘవరావు, పీవీ.సుబ్బారావు ఒక ప్రకటనలో ఆరోపించారు. న్యూ ఇండియా అక్షరాస్యత పథకం పెట్టిన అందుకు తగిన విధంగా నిధుల కేటాయింపు లేదన్నారు.

పేస్‌లో బాల్‌బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం


పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్‌తో ప్రారంభ వేడుకలు నిర్వహించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జి.శ్యామ్‌కుమార్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ పోటీల్లో 20 పురుషుల జట్లు, 12 మహిళల జట్లు పాల్గొంటున్నాయి. మొత్తం 350 మంది క్రీడాకారులు హాజరవుతుండగా వారిందరికీ ఉచిత భోజన వసతి, రవాణా సౌకర్యం కల్పించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా సులభంగా పొందవచ్చని చెప్పారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, మద్దిశెట్టి కళ్యాణ్ తెలిపారు. పోటీలు మొదటి రోజు పురుషుల విభాగంలో కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై పేస్ కళాశాల జట్టు విజయం సాధించింది. ఇక మహిళా విభాగంలో కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు చలపతి ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై గెలిచింది.

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఏర్పాటు చేయాలి

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ కోరారు. ఈ మేరకు శనివారం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారీయను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కేవలం సీఎం ఫొటోలు మాత్రమే ఉన్నాయని, డిప్యూటీ సీఎం ఫొటోలు కూడా ఏర్పాటు చేయాలని, అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

6నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు ఈనెల 6వ తేదీ నుంచి నెల రోజుల పాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణను ప్రారంభిస్తున్నట్లు ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19-45 ఏళ్ళలోపు మహిళలు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, సదుపాయాలు ఉంటాయని, వివరాలకు 9573363141 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

రైజ్‌లో ముగిసిన వర్క్‌షాపు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్‌కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న సీఎస్ఈ విభాగాలకు చెందిన విద్యార్థులకు మూడురోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. వర్క్‌షాపులో హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుస్కిల్స్‌లో పనిచేస్తున్న సాయివెంకట్ విద్యార్థులకు జాస్టికర్ జీరో ట్రస్ట్ క్లౌడ్ సెక్యూరిటీ అనే అంశంపై అవగాహన కల్పించారని ట్రెజరర్ శిద్దా భరత్ తెలిపారు. కార్యక్రమంలో గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం, విభాగాధిపతి పి.ఐజాక్‌పాల్, కో ఆర్డినేటర్ ఎం.భారతిదేవి పాల్గొన్నారు.

సాగర కాలువ గట్టు ఆక్రమణ

● అడ్డుకున్న అధికారులు


నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు, డీసీ అధ్యక్షులు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కొప్పోలు మేజర్ కాలువ గట్టును ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేస్తుండగా సాగర్ కాలువ డీసీ చైర్మన్ నల్లూరి క్రిష్ణరావు ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. శనివారం సాగర్ కాలువ గట్టు మీద కొత్త మామిడిపాలెం సమీపంలో చదును చేసి నిర్మాణం చేపట్టారు ఈ మేరకు సమాచారం తెలుసుకున్న సాగర్ ఏఈ కిరణ్ కుమార్, డీసీ చైర్మన్ క్రిష్ణారావు, వైస్ ప్రెసిడెంట్ పి.రోశయ్య తదితరులు అక్కడకు వెళ్లి నిర్మాణాను నిలిపివేయాలని బేల్దారులను కోరారు. అదే విధంగా ఉన్నతాధికారుల ద్వారా సర్వే చేయంచడానికి లేఖ రాస్తున్నట్లు ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాలలో బడ్జెట్ ప్రత్యక్ష ప్రసారం

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్-2025 ప్రత్యక్ష ప్రసారం చేశారు. విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా బడ్జెట్‌ను వీక్షించగా వాణిజ్యవిభాగం ఇన్‌చారి పి.కుసుమకుమారి ముఖ్యాంశాలను వివరించారు. పన్నులు, మార్పులు, వివిధ రంగాలకు కేటాయింపులు, ఆర్థిక విధానాలను విశ్లేషించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.అనంతలక్ష్మి, కె.రాణి, ఎం.పద్మ తదితరులు పాల్గొన్నారు. మిషన్ వెర్నింగ్, దాని ప్రాధాన్యత అంశంపై కళాశాలలో జె.హనుమంతరావు ప్రసంగించారు.

సర్పంచ్‌కు సన్మానం

మద్దిపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): యువత రాజకీయాల్లోకి రావాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ శ్రీరామమూర్తి పేర్కొన్నారు. గత నెలలో రిపబ్లిక్ దినోత్సవం రోజున విజయవాడ రాజ్‌భవన్‌లో జరిగి ఎట్ హోమ్ కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్న ఏడుగుండ్లపాడు సర్పంచ్ శిల్పసౌందర్యను శనివారం మద్దిపాడు మండల సమావేశ మందిరంలో ఎంపీపీ అరుణ, సర్పంచులు, ఎంపీటీసీలు శాలువాతో సత్కరించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం


జరుగుమల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వర్ధినేనివారిపాలెం గ్రామంలో అన్నదమ్ములైన గాలి వెంకటేశ్వర్లు, గాలి కృష్ణమూర్తిలకు చెందిన పొగాకు బ్యారన్ శనివారం దగ్ధమైంది. క్యూరింగ్ సమయంలో కర్రజారి మొద్దు గొట్టంపై పడటంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న కొండపి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.2.50లక్షల మేర నష్టం వాటిల్లిందని కొండపి అగ్నిమాపక కేంద్రం అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

హైస్కూల్‌కు కుర్చీల వితరణ


కుర్చీలను అందజేస్తున్న శిద్దా సుధాకర్


సంతనూతలపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్ర జ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్‌కు చీమకుర్తి ఆర్యవైశ్య మండలం అధ్యక్షుడు శిద్దా సుధాకర్ శనివారం 25 కుర్చీలను బహూకరించారు. 10వ తరగతి పరీక్షల్లో అధికమార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి కింద రూ.5వేలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకారెడ్డి, హెచ్‌ఎం ఫణిపద్మకుమారి, మాజీ సర్పంచ్ ఆర్.అంకారావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో మహాలక్ష్మి

నాగులుప్పలపాడు ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వై.మహాలక్ష్మి సూచించారు. ఉప్పుగుండూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వలసలను నివారించి కూలీలందరికి గ్రామాల్లోనే పనులు కల్పించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం చేపడుతోందని, ఇచ్చిన కొలతల మేరకు పనులు చేసి రోజువారీ కనీస వేతనం రూ.300 పొందాలని సూచించారు. పని ప్రదేశంలో తగిన సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. మస్టర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కొండ్రు సాల్మన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకల పంపిణీ


పలకలు, అట్టలను అందిస్తున్న దాతలు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 2(ఆంధ్ర జ్యోతి) ఎండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బొమ్మినేనివారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో శనివారం మాజీ మంత్రి ఆరేటి కోటయ్య సతీమణి రిటైర్డ్ టీచర్ కోటమ్మ వర్ధంతిలో భాగంగా కుమారుడు సుందరరాజ, కుమార్తెలు సుగుణజ్యోతి, ఇందిరాజ్యోతి, విజయజ్యోతిలు విద్యార్థులకు పలకలు, అట్టలను బహూకరించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి రూ.5 వేల సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకారెడ్డి, హెచ్‌ఎం శేషిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతన జీవులకు ఊరట : ఎస్టీయూ

కొండపి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రం బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితిని పెంచడం పట్ల ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గవిని శివశంకర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయించడం ద్వారా ఉద్యోగుల్లో 75 శాతం మందికి ఊరట లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

అవీ..ఇవీ

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు వినతి



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న నలగాటి

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనుకబడిన ప్రాంతం, ఎస్సీ నియోజకవర్గ కేంద్రమైన ఎర్రగొండపాలెం ప్రధాన కూడలిలో అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేసి నిరుపేద ప్రజల ఆకలిని తీర్చాలని టీడీపీ సీనియర్ నాయకులు నలగాటి మల్లికార్జుననాయుడు సిఎం చంద్రబాబు నాయుడును కోరారు. శనివారం సచివాలయంలో ఆయన్ను మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం పట్టణానికి ప్రజలు వస్తుంటారన్నారు. అలాంటి వారికి అన్న క్యాంటిన్ ఎంతో ఉపయోగపడుతుందని సిఎం దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. దీనికి సిఎం చంద్రబాబు నాయుడు కూడా స్పందించి పరిశీలిస్తామని తెలిపినట్లు మల్లికార్జున నాయుడు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

డప్పు కళాకారుల క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మాదిగ, చర్మ, డప్పు కళాకారుల పరిరక్షణ సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దారు కిన్నెర శాంతి, పంచాయతీ కార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావు శనివారం అవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సమితి జిల్లా అధ్యక్షులు పందిటి కిషోర్‌కుమార్, మండల అధ్యక్షులు నల్లూరి నాగయ్య, సభ్యులు బి.శ్యాం పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.20వేల వితరణ



ప్రధానోపాధ్యాయుడికి నగదు అందజేస్తున్న దాతలు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదోర్నాల మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు మండ్ల శ్రీనివాసులు అభ్యర్థన మేరకు స్పందించిన గ్రామ పెద్దలు పసుపుల వెంకటయ్య, డీలరు మేడబోయిన శివ ఆవులయ్య, గుండారెడ్డి వెంగయ్యలు రూ.20 వేల నగదును ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. దీంతో పాఠశాల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. మరింత మంది చొరవ చూపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విద్యాకమిటి ఛైర్మన్ సుబ్బారావు, పాలకవీటి శ్రీనివాసులు, కాశీరావు, లక్ష్మీ నారాయణ రామ్‌శ్రీను పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్

● జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఓంకార్



అధికారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ మార్చి 8న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఏ.ఓంకార్ అన్నారు. శనివారం గిద్దలూరు న్యాయస్థానాల పరిధిలోని బ్యాంక్, టెలిఫోన్, అధికారులు, న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు, న్యాయవాదులు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు, టెలిఫోన్, బ్యాంక్‌ల ప్రీలిటికేషన్ కేసులను రాజీ చేసుకోవాలన్నారు. తద్వారా డబ్బు, సమయం ఆదా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పిడతల రాజశేఖర్‌రెడ్డి, జి.ఆనంద్‌కుమార్, యూ.బాలకృష్ణ, షేక్ ఫాజిల్, డి.సిద్ధయ్య, కె.పోలయ్య, కె.రంగమోహన్, యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్‌బిఐ ఫీల్డ్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ బి.నాగేంద్రనాయక్, బిఎస్ఎన్ఎల్ అధికారి రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టడంతో ఘటన

గిద్దలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన రాచర్ల మండలం యడవల్లి సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. గిద్దలూరుకు చెందిన బెల్లం చెన్నయ్య (56) అనే వ్యక్తి విజయవాడలో గృహప్రవేశ కార్యక్రమం ముగించుకుని బంధువులతో పాటు కారులో గిద్దలూరు తిరిగి వస్తున్నాడు. శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి వీరు ప్రయాణిస్తున్న కారు ట్రాక్టర్‌ను ఢీకొన్నది. దీంతో కారులో ముందు సీటులో కూర్చున్న చెన్నయ్య మృతిచెందగా వెనుక కూర్చున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. చెన్నయ్య గతంలో ఒక ప్రైవేటు పాఠశాలలో కొన్నాళ్లపాటు ఉపాధ్యాయునిగా పని చేశారు.

సంస్కరణల పేరుతో బలహీన పరచవద్దు



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

గిద్దలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సంస్కరణల పేరుతో ప్రభుత్వ పాఠశాలలను బలహీన పరచవద్దని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట శనివారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసే నిర్ణయాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. 117 నంబరు జీవోతో ప్రాథమిక విద్య నాశనమైందన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు యల్లా శ్రీనివాసులు, ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, పాండురంగస్వామి, పాండు, మండలశాఖ అధ్యక్షులు దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

వేతన జీవులకు ఊరట : ఎస్టీయూ

కొండపి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రం బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితిని పెంచడం పట్ల ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గవిని శివశంకర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మి నహాయించడం ద్వారా ఉద్యోగుల్లో 75 శాతం మందికి ఊరట లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

పేదరికం లేని రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

● ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి స్వామి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ● లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ



మార్కాపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

బేస్తవారపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పింఛన్లను పెంచి హామీని నిలబెట్టుకుందన్నారు. శనివారం బేస్తవారపేట మండలం, చిన్నఓబినేనిపల్లె గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రితో పాటు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి పాల్గొని పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో 63 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. భర్త మృతి చెందితే వెంటనే పింఛన్లు అందజేస్తున్నామన్నారు. దేశంలో పెద్దమొత్తంలో పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. దివ్యాంగులైన విద్యార్థులకు వారి ఖాతాలోనే పింఛన్లు జమచేస్తున్నట్లు తెలిపారు. వలస వెళ్లిన వారు మూడు నెలలకు ఒకసారి పింఛన్ తీసుకొనే వెసులుబాటు కల్పించామన్నారు. ప్రజలకు సులభంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు వాట్సప్ గవర్నన్స్ తీసుకొచ్చినట్లు వివరించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. బేస్తవారపేట మండలంలో రూ.7వేల పింఛన్ల గాను, చిన్న ఓబినేని పల్లె గ్రామంలో 150 పింఛన్లు ఉన్నాయి. వీటిని మంత్రి స్వయంగా పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి లక్ష్మీనాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఎంపీడీవో ఆకుల వెంకట రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్ర, సర్పంచ్ బి.శ్రీనిశ్వర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, చెట్టిచెర్ల మాజీ సర్పంచ్ తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, బెల్లంకొండ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : ప్రజాసంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని శివరాంపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామం లో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మెట్టు లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ కూటమి ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవరాజుగట్టు పంచాయతీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తు న్నట్లు తెలిపారు. రానున్న రోజులో పంచాయతీ పరిధిలోని అన్ని మట్టి రోడ్లలో సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తాన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో సూపర్ సిక్స్ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇళ్లు లేని పేదలు దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని గుంతలను పూడ్చివేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాన్‌సుందరం, ఎంఆర్ఐ గోపీ, టీడీపీ మండలాధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, టీడీపీ యువనాయకులు ఆనెకాళ్ల శ్రీనివాసులరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జడ్డా రవి, టీడీపీ నాయకులు సుబ్బరామిరెడ్డి, గుమ్మా గంగరాజు, ఇండా రామకృష్ణారెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురం : రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో దివాలా తీయించింది చాలక నేడు కూటమి ప్రభుత్వంపై వైసీపీ విరమర్శలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 10వ వార్డులో శనివారం జరిగిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాటి వైసీపీ ప్రభుత్వం అన్ని విధాల సర్వ నాశనం చేసిందన్నారు. అత్యంత దారుణమైన పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఎంతో కష్టపడి మళ్లీ అభివృద్ధి పథంవైపు నడిపించేందుకు కృషిచేస్తుంటే వైసీపీ శ్రేణులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో సకాలంలో జీతాలు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. నేడు ఎన్ని గడ్డు పరిస్థితులున్నా 1వ తేదీకల్లా ఉద్యోగులకు, పింఛన్‌దారులకు నగదు వచ్చేలా చూస్తున్నట్లు తెలిపారు. పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, మాలపాటి వెంకటరెడ్డి, కౌన్సిలర్లు నాలి కొండయ్య, కశ్శెట్టి నగేష్, పఠాన్ హుసేన్‌ఖాన్, జనసేన నాయకులు సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : లబ్ధిదారుని ఇంటి వద్దకే అధికారులు వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రాయవరం గ్రామంలో శనివారం పింఛన్ల పంపిణీని పరిశీలించారు. ఆయన వెంట పంచాయితీ కార్యదర్శి మోహన్‌రావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలో శనివారం 95 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్లు ఎంపీడీఓ బండారు శ్రీనివాసులు తెలిపారు. మిగిలిన వారికి ఆది సోమవారాల్లో పంపిణీ చేస్తామన్నారు.





పెద్దారవీడు మండలంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు, రాయవరంలో పింఛన్ల పంపిణీ

ఘనంగా వాసవీ అమ్మవారి ఆత్మారణ దినం





పూజల్లో పాల్గొన్న భక్తులు, విశేష అలంకరణలో అమ్మవారు

గిద్దలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిశాలలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా చివరిరోజు శనివారం ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి సామూహికంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పెట్టారు. సాయంత్రం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సామూహికంగా పుష్పాభిషేక కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, గౌరవాధ్యక్షులు గర్రె సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు శివపురం ఆంజనేయులు, కమిటీ ప్రతినిధులు చంటి, దమ్మాల జనార్ధన్, జిలకర సత్యం, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

మంత్రికి మైనారిటీ నాయకుల సన్మానం



మంత్రిని, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

కంభం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, లిడ్‌క్యాప్ ఛైర్మన్ మాణిక్యరావు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిలను కంభం మండల టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం సభ్యులు సయ్యద్ రఫీ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల మండలం యడవల్లిలో లెదర్‌పార్కు శంకుస్థాపనకు మంత్రి వచ్చిన సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు సయ్యద్ అనీస్ అహమ్మద్, ఒంగోలు పార్లమెంటు ముస్లిం మైనారిటీ సెల్ కార్యదర్శి అత్తర్ షేక్‌హుస్సేన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సయ్యద్ నూరుల్లాఖాద్రి, బీసీ నాయకులు షేక్ ఖాదర్‌వలి, బూత్ కన్వీనర్ జేడీ.బాబు, పఠాన్ నాగూర్‌వలి, ఇర్ఫాన్‌ఖాన్, ఫయాజ్, నబీ తదితరులు పాల్గొన్నారు.

దిగివచ్చిన కూరగాయల ధరలు

- పడిపోయిన టమోటా ధర
- అదే దారిలో క్యాలిఫ్లవర్, వంకాయ
- పెరిగిన బెండకాయ, దోసకాయ



గిద్దలూరు మార్కెట్‌లో ఉన్న కూరగాయలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ధరలతో దడ పుట్టించిన టమోటా ప్రస్తుతం నేల చూపులు చూస్తోంది. టమోటా ప్రస్తుతం హోల్‌సేల్‌లో కిలో రూ.10 రూపాయలకు విక్రయిస్తుండగా రిటైల్‌లో రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. టమోటా పంట దిగుబడి గణనీయంగా పెరగడంతో టమోటా పంట ఉత్పత్తులు మార్కెట్‌కు రావడంతో ధరలు ఒక్కసారిగా దిగజారిపోయాయి. ఇక కాలిఫ్లవర్ గత నెలలో రూ.50 నుంచి రూ.40 రూపాయలు పలుకగా ప్రస్తుతం రూ.20 పలుకుతోంది. మునక్కాయ కూడా గత నెలలో పావుకిలో రూ.30 ఉండగా దిగుబడి పెరగడం, స్థానిక పంట కూడా మార్కెట్‌కు రావ డంతో రూ.20కి చేరు కుంది. వంకాయలు కూడా గత నెలలో రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.30 రూపాయలకు తగ్గింది. బంగాళాదుంపలు కూడా కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.30కి తగ్గింది. ఇక క్యారెట్ కూడా గతంలో రూ.60 ఉంటే ప్రస్తుతం రూ.40కి వచ్చింది. పలు కూరగాయల ధరలు తగ్గగా మరికొన్నిటి ధరలు మాత్రం పెరిగాయి. బెండకాయలు గత నెలలో రూ.20 నుంచి రూ.30కి విక్రయించగా ప్రస్తుతం రూ.50కి చేరుకు న్నాయి. పంట దిగుబడి తగ్గడం, స్థానికంగా కూడా పంట ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్‌లో ధరలు పెరిగాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. దోసకాయల ధరల పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. దోసకాయ గత నెలలో కిలో రూ.30 ఉండగా ప్రస్తుతం రూ.50కి చేరింది. దీంతో కొనుగోలు దారులు దోసకాయలంటేనే వెనుకడుగు వేస్తున్నారు. ఇక పచ్చిమిర్చి, కాకర, ఇతర కూరగాయలన్నీ సాధారణ ధరలే ఉన్నాయి. టమోటా ధర ఇలాగే కొనసాగితే తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీవోఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలి

డీఆర్‌డీఏ పీడీ రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి). గ్రామాల్లో వీవోఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ ఆదేశించారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో మార్కాపురం, తర్లుపాడు మండలాల వీవోఏలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ రవికుమార్ మాట్లాడుతూ గ్రామాలలో స్వయం సహాయక సభ్యులకు ప్రాజెక్టులోని అన్ని అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. నిబద్ధతతో ఉంటూ సభ్యులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రాజెక్టు ఇచ్చిన యాప్‌లలో పారదర్శకంగా సభ్యుల వివరాలను నమోదు చేయాలని తెలిపారు. మహిళా సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం క్లస్టర్ సమన్వయకర్త సుధాకర్, మార్కాపురం, తర్లుపాడు ఏపీఎంలు పిచ్చయ్య, రమేష్‌బాబు, ఎల్‌సీ నాగభూషణం, శ్రీనిధి మేనేజర్ సులోచన, సీసీలు నాగయ్య, మనోకుమారి, అకౌంటెంట్ నాగమణి, వీవోఏలు పాల్గొన్నారు.

కొప్పుకొండపై 4న రథసప్తమి వేడుకలు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెంలోని కొప్పుకొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కొప్పుకొండ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 4న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ సేవాసంఘం సభ్యులు శనివారం తెలిపారు. అఖిల విశ్వగాయత్రి పరివార్ శాంతికుంజ్ హరిద్వార్ పండితులతో 5సంవత్సరాల లోపు పిల్లలకు అక్షరాభ్యాసం, గాయత్రి హోమం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రథసప్తమి వేడుకలను తిలకించి తీర్థ ప్రసాదాలు అందుకోవాలని కోరారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల బాల్ బ్యాట్మింటన్ పోటీలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్‌తో ప్రారంభ వేడుకలు నిర్వహించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జి.శ్యామ్‌కుమార్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ పోటీల్లో 20 పురుషుల జట్లు, 12 మహిళల జట్లు పాల్గొంటున్నాయి. మొత్తం 350 మంది క్రీడాకారులు హాజరవుతుండగా వారిందరికీ ఉచిత భోజన వసతి, రవాణా సౌ కర్యం కల్పించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా సులభంగా పొందవచ్చని చెప్పారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, మద్దిశెట్టి కళ్యాణ్ తెలిపారు. పోటీలు మొదటి రోజు పురుషుల విభా గంలో కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై పేస్ కళాశాల జట్టు విజయం సాధించింది. ఇక మహిళా విభాగంలో కేకేఆర్ అండ్‌కేఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు చలపతి ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై గెలిచింది.

నిలిచిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు

● నాడు ఐదేళ్లుగా నిధులివ్వని వైసీపీ సర్కార్ ● స్వయం సహాయక సంఘాల సమావేశాలకు వసతులు కరువు



నిరుపయోగంగా ఉన్న మహిళా శిశుసంక్షేమశాఖ భవనం

పొదిలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గతంలో టీడీపి ప్రభుత్వ పాలనలో మహిళా శిశుసంక్షేమసంఘం, మండల సమాఖ్య భవన నిర్మాణాలు మూడు వంతుల నిర్మాణాలు పూర్తయ్యాయి. టీడీపీ సమయంలోనే రెండు భవనాలు శ్లాబు వరకు పూర్తి చేశారు. ప్రహరీ ఇతర నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. రెండు భవనాలు రూ.90లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు. కాంట్రాక్టర్ పనులు వేగంగా చేశారు. పనులు పూర్తయిన వరకు బిల్లులు వచ్చాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో భవనాల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఇప్పటికీ ఆ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే పాలన సాగిస్తున్నాయి. దీంతో అంగన్వాడి, మహిళ శిశు సంక్షేమశాఖ సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు.

పొదిలి ప్రాజెక్ట్ పరిధిలో సుమారుగా 149 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కార్యకర్తలకు నెలలో కనీసం 10 మీటింగ్‌లైన జరుగుతుంటాయి. వాటిని నిర్వహించుకునే వెసులుబాటు లేక అసంపూర్తిగా నిలిచిన భవనాల్లోనే సమావేశాలు నిర్వహిస్తూ, కాలం వెల్లదీస్తున్నారు. అదేవిధంగా మహిళ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 1517 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. నిత్యం లోన్‌లు వగైరా పనుల నిమిత్తం సుమారుగా 300ల మంది కార్యాలయానికి వస్తుంటారు. అయితే కార్యకలాపాలు నిర్వహించే భవనం చిన్నది కావడం, మహిళలకు మరుగుదొడ్లు లేకుపోవడంతో సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలులేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయానికి రావాల్సి వస్తోందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్త్రీశిశుసంక్షేమశాఖ భవనానికి రూ.32లక్షలు, మండల సమాఖ్య భవనానికి రూ.60లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు. అవి మూలనపడి చుట్టూ చిల్లచెట్లు పెరి గాయి. భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో భవనాల నిర్మాణాలపై ప్రజాప్రతినిధు లు, అధికారులు అడిగే ధైర్యంచేయలేక మిన్నకుండిపోయారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు. సమావేశాలకు ఇబ్బందిగా మారిందని త్వరగా భవనాలు పూర్తి అయితే కొత్త భవనంలోకి వెళ్లవచ్చని ఆశపడిన వారికి నాడు నిరాశే మిగిలింది. ప్రస్తుతం ఇప్పుడు నిలిచిన కార్యాలయ భవనాలు రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు, మందు బాబులకు అడ్డాగా మారాయని పలువురు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాలపై ప్రత్యేక చొరతీసుకొని నిరుపయోగంగా ఉన్న భవనాలను పూర్తి చేసి సంబంధిత శాఖలకు అప్పగించే విధంగా చర్యలు





వీటిలో కొనసాగుతున్న మండల మహిళా సమాఖ్య భవనం, ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె భవనం ఇదే

మిర్చి రైతుకు ధరాఘాతం

పెరిగిన పెట్టుబడి
తగ్గిన దిగుబడి
పడిపోయిన ధర
కూలీల ఖర్చు తడిసిమోపెడు
ఆందోళనలో రైతులు





తాలు కాయలను గ్రేడ్ చేస్తున్న కూలీలు



ఎండబెట్టిన కాయల్లో సగానికిపైగా ఉన్న తాలు కాయలు (ఇన్‌సెట్లో) ఏరివేసిన తెల్ల కాయలు

కురిచేడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మిర్చి సాగు చేసిన రైతులకు ఈ సంవత్సరం కలిసి రాలేదు. పెట్టుబడి పెరగడంతో పాటు దిగుబడి సైతం తగ్గడం, తాలు కాయలు రావడంతో రైతులు నష్టాలబారిన పడ్డారు. దీనికి తోడు ధర సైతం భారీగా పతనం కావడంతో మరింత దిగాలు చెందుతున్నారు.

కురిచేడు మండలం ఈఏడాది 7,500 ఎకరాలలో రైతులు మిర్చిని సాగుచేశారు. సకాలంలో వర్షాలు పడటం, సాగర్ కాలువకు నీరు రావడంతో ఎక్కువ మంది మిర్చి పంట సాగుకు ఆసక్తి చూపారు. ఇప్పటి వరకు ఎకరాకు లక్షన్నర రూపాయలకు పైగానే ఖర్చు చేశారు. దిగుబడి చూస్తే మొత్తంగా 20 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. అవీ నాణ్యమైన కాయలు వస్తేనే రైతుకు గిట్టుబాటు అయ్యేది. కానీ అందులో సగానికి సగం తాలుకాయల దిగుబడి వస్తోంది. గత సంవత్సరం మిర్చి ధర ఆశాజనకంగా ఉండటంతో లాభాలు బాగానే వచ్చాయి. దీంతో అధిక ధరకు కౌలుకు తీసుకుని మరీ మిర్చి పంటను వేశారు. గత సంవత్సరం క్వింటా మిర్చి ధర అత్యధికంగా రూ.21వేలు, అత్యల్పంగా రూ.18వేలు, తాలు కాయలు రూ.9వేలు దాకా ధర పలికాయి. ఈ సంవత్సరం మిర్చి ధర భారీగా పతనం అయింది. ప్రారంభంలో పర వాలేదు అనుకున్నా రోజులు గడిచే కొద్దీ ధర తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం క్వింటా మిర్చి ధర రూ.12వేల దాకా ఉంది. తాలు కాయలు రూ. 6వేల దాకా పలుకుతున్నాయని రైతులు అంటున్నారు. గత సంవత్సరం కూలీకి ధర రోజుకు రూ.400 ఉంటే ఈ సంవత్సరం రూ.500కు పెరిగింది. ఇప్పటివరకు రైతులు మొదటి కోతలు పూర్తిచేశారు. ఎకరాకు 7 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ఆదిలోనే దిగుబడి తగ్గడం వచ్చిన వాటిలో తాలు కాయలు రావడంతో నాణ్యమైన కాయలు సగమే ఉంటున్నాయి. కోసిన కాయలు ఎండబెట్టాక వాటి నుంచి నాణ్యమైన కాయలు బయటకు తీయడానికి గ్రేడింగ్ చేయడానికి సైతం కూలీల ఖర్చు అదనంగా అవుతున్నది. రానున్న రెండు , మూడు కోతల్లో ఇంకా దిగుబడి గణనీయంగా తగ్గే పరిస్థితి కనిపిస్తోంది. మొత్తం మీద మిర్చి పంట సాగు చేసిన రైతులకు ఈ సంవత్సరం నష్టాలు తప్పడం లేదు. కౌలుకు భూములు తీసుకుని సాగు చేసిన రైతులు మరింత నష్టాలపాలవుతామని ఆందోళనకు గురవుతున్నారు. ఇలా ధర ఉంటే కౌలు అయినా కట్టగలమా లేదా అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. మిర్చి ధర పెరగక పోతే తీవ్ర నష్టాలు తప్పవని రైతులు అంటున్నారు.

ఆదరణ లేని వారికి పింఛన్ ఓ భరోసా

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



కాశిరెడ్డి కాలనీలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి ఆదరణ లేని వృద్ధులకు, దివ్యాంగులకు, మహిళలకు ప్రభుత్వం అందించే పించన్ ఎంతో భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని కాశిరెడ్డికాలనీలో శనివారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్‌ను రూ. 4వేలకు పెంచిన ఘనత చంద్రబాబుదే అన్నారు. కనిగిరి అభివృద్ధికి ప్రజలు సహకారం అందించాలన్నారు. ఈ సమయంలో ఓ వృద్ధురాలు ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చింది. ఎమ్మెల్యే వెంటనే స్పందించి నిర్మాణానికి అవసరమైన సహకారం అందించే విధంగా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కాలనీలో మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా సచివాలయం సిబ్బంది తిప్పుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావటంతో ఆయన సచివాలయ సిబ్బందిని పిలిపించి ఘటనా స్థలిలోనే విచారించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసఫ్‌డానియేలు, చైర్మన్ గఫార్, టీడీపీ నేతలు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, నజిముద్దీన్, చిలకపాటి లక్ష్మయ్య, తమ్మినేని చినరామిరెడ్డి, సచివాలయ, మున్సిపల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కంభాలదిన్నెలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీడీవో

మొరాయించిన సర్వర్

పామూరు : తెల్లవారక మునుపే పింఛన్లను పంపిణీ చేయాలనే అధికారుల ఆత్రుతకు సర్వర్ గండికొట్టింది. ఈ కారణంగా పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొంది. దాంతో అధికార పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు అసహనానికి గురయ్యారు. రెండు గంటల అనంతరం సర్వర్ పనిచేయడంతో పింఛన్ల పంపిణీ చేశారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో బి. సురేష్ పాల్గొని పరిశీలించారు. పట్టణం, మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన పంపిణీ కార్యక్రమాల్లో కూటమి నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం మండలంలోని కోవిలంపాడు గ్రామంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ తెలుగుయువత అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాష పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే వి.బైలు, చెన్నపునాయునిపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకుడు మాలకొండయ్య పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● పింఛన్ల పంపిణీలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి మండలంలోని లంకోజనపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, నారపుశెట్టి పాపారావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు

దర్శి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని లంకోజనపల్లిలో శనివారం మాజీ ఎమ్మెల్యే పాపారావు, రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 2047 నాటికి అభివృద్ధిలో అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పదవి చేపట్టిన ఎనిమిది నెలల కాలంలో ఐటీ, విద్యాశాఖల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారని వివరించారు. గత ఎనిమిది నెలలుగా వృద్ధులకు, వితంతువులకు వికలాంగులకు క్రమం తప్పకుండా పింఛన్లు అందిస్తుండటంతో వారి కళ్లల్లో ఆనందం చూస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, స్థానిక టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు : మండలంలోని దోసకాయలపాడులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం పెన్షన్ దారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తుందని తెలిపారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి పాలనలో మండలంలో పల్లె పండుగ రహదారులు, గోకులం షెడ్లు, గ్రామాల నుంచి ఎస్సీకాలనీలకు బీటీ రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరయి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ లలిత్‌సాగర్, దర్శి నగరపంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యమండల టీడీపీ అధ్యక్షులు బి. ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

మండలంలో 92శాతం పెన్షన్ల పంపిణీ

మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు 92శాతం శనివారం పంపిణీ చేశారు. మండలంలో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్లు 6,162 మంది ఉండగా మొదటి రోజు 5,601 మందికి పంపిణీ చేశారు. మొదటి రోజు 92శాతం పెన్షన్లు అందజేశారు.ఇన్‌చార్జి ఎంపీడీవో దారా హనుమంతరావు గ్రామాల్లో జరుగుతున్న పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించారు.

బీసీల అభివృద్ధికి టీడీపీ పెద్ద పీట

ముండ్లమూరు : బీసీల అభివృద్ధికి టీడీపీ పెద్ద పీట వేస్తుందని, ఆర్థికంగా ఎదిగేందుకు పలు పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టారని టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆమె శనివారం ముండ్లమూరులో బీసీ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు. బీసీలు పలు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకొనేందుకు సైట్ ఓపెన్ అయిందని, ఈనెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. బీసీ కార్పొరేషన్ అధికారి ప్రభావతి రుణాల గురించి ఆమె వివరించారు.

పేదల పక్షపాతి చంద్రబాబు

ఉగ్ర కృషితో వితంతు పెన్షన్ మంజూరు
ఆనందంతో కళ్లు చెమర్చిన ఓ వృద్ధురాలు

హనుమంతునిపాడు (కనిగిరి), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్షపాతి చంద్రబాబు అని ఎన్టీయార్ భరోసా తొలిపింఛన్ అందుకుంటున్న ఓ వృద్ధురాలు ఆనందంతో ఉప్పొంగిపోయింది. హనుమంతునిపాడు మండలంలోని నందనవనం గ్రామానికి చెందిన షేక్ మౌలాబి భర్త ఏడాదిన్నర క్రితం మృతిచెందారు. పిల్లలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. దీంతో ఆమె స్వగ్రామం నందనవనంలోనే ఉంటూ పొలం పనులకు వెళ్తూ వచ్చిన ఆడబ్బులతోనే జీవిస్తోంది. కానీ ఆరోగ్యం సహకరించకపోవటంతో ఆ పనులకు కూడా వెళ్లక పోవటంతో ఆర్థికంగా పూట గడవటం కష్టంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని ఆపార్టీ నేతలు, సచివాలయాల చుట్టూ, కాళ్లు అరిగేలా తిరిగింది. వితంతు పెన్షన్‌కు అర్హురాలైనప్పటికీ పింఛన్ మంజూరు చేయలేదు. ఎన్నికలకు ముందు ఆ గ్రామంలో పర్యటనకు వెళ్లినపుడు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తాను అధికారంలోకి రాగానే పింఛన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్), గ్రామపార్టీ అధ్యక్షుడు పెంచికల రామకృష్ణలు మౌలాబికి పింఛన్ మం జూరు చేయించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆ వృద్ధురాలు ఆనందానికి అవధు లేకుండా పోయింది. పింఛన్ డబ్బులు అందుకొని ఆనందంతో కళ్లు చెమర్చింది.



వృద్ధురాలు మౌలాబీకి పింఛన్ అందిస్తున్న టీడీపీ నేతలు, సచివాలయ ఉద్యోగి

అవీ..ఇవీ



అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో వాసవీమాత గ్రామోత్సవం

పామూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ వేడుకలను భక్తులు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వ హించారు. ముందుగా స్థానిక సత్యదేవుని దేవస్థానం వద్ద నుంచి కలశాలతో ఊరేగింపుగా వాసవీ ఆలయం వద్దకు వచ్చారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో పలువురు భక్తులు వాసవీ మాత చిత్ర పటాలను పట్టుకొని అగ్నిగుండం ప్రవేశం చేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక వాహనంలో అమ్మవారిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన గౌరవ అధ్యక్షులు వి సత్యనారాయణ, ఛైర్మన్ వై. బాల కొండలరావు, దరిశి సత్యనారాయణ మహిళా భక్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకరశర్మ

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

పీసీపల్లి,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):మండలంలో ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు.స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, టీఏలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిపనులను వెంటనే మొదలు పెట్టించాలని, డిమాండ్ ఇచ్చిన ప్రతిఒక్కరికీ పనులు చూపించాలని సూచించారు. ఫారం పాండ్స్, పంట కాలువల పనులు వెంటనే మొదలు పెట్టించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీఏలు, ఎఫ్‌ఏలు తదితరులు ఉన్నారు.



క్లాష్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, ఎంపీడీవో జనార్దన్, అధికారులు

17వ తేదీ వరకు క్లాష్ ప్రోగ్రాం

ముండ్లమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని క్లాష్ ప్రోగ్రాంను ఈనెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జరుగుతున్నట్టు ఎంపీడీవో ఆర్. జనార్దన్ తెలిపారు. ఈ కార్యక్రమం కింద శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రత్యేక వాహనాన్ని ప్రారంబించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాన్ బాబు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేతి పంపుల మరమ్మతులు చేసి తాగు నీటి ఎద్దడి సమస్య లేకుండా చూస్తామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందుగానే గ్రామాలను సందర్శించి చేతి పంపులు మరమ్మతులకు గురైతే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, కార్యాలయ సూపరింటెండెంట్ కల్పన, టీడీపీ నాయకులు గూడల సాంబశివారెడ్డి, సిబ్బంది ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేస్తున్న పార్థసారథి

క్రీడా దుస్తుల అందజేత

సీఎస్‌పురం(పామూరు) ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనే విద్యార్థులకు క్రీడా దుస్తులను కదిరి బాబురావు విద్యా సంస్థల కరస్పాండెంట్ కదిరి పార్థసారథి శనివారం అందజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరన్నగౌడ్, వ్యవసాయ కళాశాల ఐసీఆర్ స్పెషల్ అధికారి డాక్టర్ రామస్వామి, ఉప సర్పంచ్ టి. బాబురావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలకు పన్నులు చెల్లించాలి

పామూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పామూరు మేజర్ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా ప్రచార హోర్డింగ్‌లు ఏర్పాటు చేయరాదని కార్యదర్శి జీవీ అరవిందరెడ్డి తెలిపారు. పామూరు పట్టణంలో ఏర్పాటు చేసిన పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రచార ఫ్లెక్సీలకు అడుగుకు మూడు రూపాయలు వంతున పంచాయతీకి పన్ను చెల్లించాలని లేని పక్షంలో తొలగిస్తామని మైకుద్వారా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్రకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ టీఎన్ఎస్‌వీ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడు బాబు ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్‌కు పన్ను చెల్లించి రశీదు పొందారు. ఇలాగే అందరూ పంచాయతీ పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.



మున్సిపల్ అధికారులతో వాదన చేస్తున్న గృహయాజమానులు (ఇన్‌సెట్లో) తొలగిస్తున్న ఆక్రమణలు

ఆక్రమణల తొలగింపులో వివాదం

● ఎట్టకేలకు రికార్డులు పరిశీలించి తొలగింపు

కనిగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జరుగుతున్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో శనివారం మున్సిపల్ ప్లానింగ్ అధికారులు, గృహ యజమానుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పట్టణంలోని నగరికంటి బసవయ్య సెంటరు నుంచి బొడ్డుచావిడి వరకు గతంలో ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. కొంతదూరం వెళ్లేసరికి పలువురు గృహాలకు చెందిన వారు తొలగింపు పనులను ఆపాలని కోర్టును ఆశ్రయించటంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. దీంతో రోడ్డు ఆక్రమణ తొలగింపు పనులు మధ్యలోనే ఆగిపోవటంతో వాహన రాకపోకలతో పాటు షాపులకు, వివిధ పనులకు వచ్చే వారికి ఇబ్బందిగా మారింది. గడువు అనంతరం శనివారం మున్సిపల్ అధికారులు తిరిగి తొలగింపు పనులు చేపట్టుతుండగా గృహ యజమానులు రెండు వైపులా విస్తరణ పనులు చేపటడితే మేమూ సహకరిస్తామని, కానీ ఒక వైపు మాత్రమే విస్తరణ పేరుతో తొలగించటం అన్యాయమని మున్సిపల్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. 1959 రిజిస్ట్రేషన్ పత్రాల ఆధారంగా మా స్థలం ఉన్నంత వరకు కట్టుకున్నామని యజమానులు వాదించారు. దీంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సువర్ణబాబు అప్పటి పంచాయతీ (నేడు మున్సిపల్) గ్రామ సర్వే రికార్డులు ఆధారంగా తొలగింపు పనులు చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో గృహాల ఆక్రమణలను తొలగించి వేశారు.

జీరో ఖాతాల్లోకి చేరిన భూములకు త్వరలో మోక్షం

● క్రమబద్ధీకరణకు అధికారుల శ్రీకారం

దర్శి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జీరో ఖాతాల్లో చేరిన భూములకు త్వరలో మోక్షం కలగనుంది. రికార్డులు క్రమబద్ధీకరణ చేసేందుకు రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. మండలంలో మొత్తం ఎనిమిది వేలు జీరో ఖాతాల్లో ఉండగా అందులో పదకొండు వేల ఎకరాలు రైతులకు హక్కు కల్గిన భూమి ఉంది. నాలుగు సంవత్సరాలుగా క్రమబద్ధీకరణకు నోచుకోక ఇబ్బంది పడుతున్నారు. రైతులకు పూర్తిహక్కు కల్గిన భూములు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారుల తప్పిదం వలన జీరో ఖాతాల్లో చేరాయి. అప్పటి నుంచి వ్యవసాయ రుణం తీసుకునేందుకు రైతులకు అవకాశం లేకుండా పోయింది. కుటుంబ అవసరాల కోసం విక్రయించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో భూమి హక్కుదారులు ఏం చేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. గతంలో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా పని జరగలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీరో ఖాతాల్లో చేరిన భూములను, 22ఏ లో చేరిన భూములను క్రమబద్ధీకరించి హక్కు కల్గిన రైతులకు రికార్డులు క్రమబద్ధీకరించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో రెవెన్యూ అధికారులు జీరో ఖాతాలో చేరిన జాబితాను జిల్లా అధికారులకు పంపారు. ఆ భూములకు సంబంధించి నిజమైన హక్కుదారులకు రికార్డులు క్రమబద్ధీకరించాలని నివేదికలు అందించారు. దీంతో త్వరలో జీరో ఖాతాల్లోకి చేరిన భూములకు మోక్షం కల్గి రైతులకు హక్కు లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



పొగాకు చేలో పైప్‌లైన్ పగిలి ఉబికి వస్తున్న నీరు

పగిలిన ఎన్ఏపీ పైపులైన్

● వృథాగా పోతున్న తాగునీరు

ముండ్లమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిలకలూరిపేట సమీపంలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పక్కన ఒక రైతు పొలంలో నుంచి వెళ్తున్న ఎన్ఏపీ పైపులైన్ శనివారం సాయంత్రం పగిలి పోయింది. దీంతో ఎన్ఏపీ నీరు వృథాగా పోతోంది. ఎన్ఏపీ నీరు పగిలి పోయిన ప్రదేశంలో పొగతోటలు ఉండటంతో ఆ ప్రాంత మంతా జలమయ మైంది. పైపులైన్ పెద్దగా పగలటంతో నీరు చిందిస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఎన్ఏపీ పైపులైన్‌కు మరమ్మతులు చేసి ఎగువ ప్రాంత మైన వేంపాడు, శంకరాపురం ప్రాంతాలకు తాగు నీరు యథావిధిగా నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ధాత్రి ఫార్మర్స్ ప్రారంభోత్సవానికి ఉగ్రకు ఆహ్వానం

పామూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : పామూరు పట్టణంలో ఈ నెల 15 వ తేదీన రైతుల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ధాత్రి ఫార్మర్స్ ప్రొడ్యూస్ రైతు డిపో ప్రారంభోత్సవానికి రావాలని కోరుతు నిర్వాహకులు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి శనివారం ఆహ్వాన పత్రిక అందజేసారు. కనిగిరిలోని ఉగ్ర క్యాంపు కార్యాలయంలో ఉగ్రను, టీడీపీ నాయకులు యారవ శ్రీనువాసులును మర్యాదాపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ఎరువుల సొసైటీ నాయకలు సొల్లేటి బాబురావు, వరదా ఓబులేసు, డాక్టర్ కొట్టే వెంకటేశ్వర్లు ఉన్నారు.

మద్యం సేవించి ఆటోలు నడిపితే కఠినచర్యలు

పీసీపల్లి,ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య అన్నారు.స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం మోటారు వాహన చట్టం నిబంధనలను అతిక్రమించడమేనని అన్నారు.మద్యంతాగి వాహనాలు నడిపినా, సరైన పత్రాలు లేకుండా ఆటోలు తిప్పినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డ్రైవర్లను హెచ్చరించారు.

క్రైం సమాచారం

చోరీ చేసిన బంగారం గుర్తింపు

● నిందితుడు మైనర్.. రిమాండ్.. జువైనల్ హోంకు తరలింపు

కురిచేడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కురిచేడు నుసుం బజారు ప్రాథమిక పాఠశాల ఎదురుగా నివశిస్తున్న ఉపాధ్యాయుడు మాదినేని హనుమంతరావు గృహంలో మూడు రోజుల క్రితం చోరీ జరిగింది. 10 సవర్ల బంగారాన్ని అపహరించారు. ఓ మైనర్ బాలుడు దొంగతనం చేసి ఆ బంగారాన్ని తన ఇంటికి కూతవేటు దూరంలో గుంత తీసి అందులో పెట్టాడు. విచారణ సమయంలో పోలీసులు సమీపంలో ఉన్న పాఠశాల ఉపాధ్యాయులను చోరీ గురించి తెలుపుగా వారు ఓ బాలుడిపై అనుమానాన్ని వ్యక్తం చేశారు. పోలీసులు ఆ బాలుడిని పట్టుకుని విచారించగా దొంగతనం చేసి దాచిపెట్టిన స్థలాన్ని చూపాడు. దీంతో చోరీ అయిన మొత్తం బంగారం చిక్కింది. ఈ కేసులో త్రిపురాంతకం సీఐ అసన్, కురిచేడు ఎస్ఐ శివలు కేసును త్వరగా ఛేదించారు. బాలుడిని ఒంగోలులోని జువైనల్ కోర్టులో ప్రవేశ పెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు. ఆ వెంటనే బాలుడిని తిరుపతి జువైనల్ హోంకు తరలించారు.

జడ్పీలో.. జగడాలు?

- పాలనలో ఎవరి దారి వారిదే
- పాలకవర్గం, అధికారుల మధ్య కొరవడిన సమన్వయం
- చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య అగాధం
- పరీక్షలు సమీపిస్తోన్నా స్టడీ మెటీరియల్, అల్పాహారం అందని పండే

- జడ్పీ చైర్‌పర్సన్ చెప్పింది సీఈవో చెయ్యరు. ఫైళ్లు పంపిస్తే ఆపేస్తారు.
- సీఈవో మీటింగ్ ఏర్పాటు చేస్తే చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈవో హాజరు కారు.
- డిప్యూటీ సీఈవో ఫైల్ పంపిస్తే సీఈవో పక్కన పెట్టేస్తారు.
- జనవరి 1న విడుదల కావాల్సిన జిల్లా పరిషత్ డైరీ ఫిబ్రవరి వచ్చినా సిద్ధం కాలేదు.
- ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని జడ్పీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇవ్వాల్సిన స్టడీ మెటీరియల్ ఇంకా ప్రింట్ కాలేదు.
- సాయంత్రం పదో తరగతి పిల్లలకు పెట్టాల్సిన అల్పాహారంపై అసలు నిర్ణయమే జరగలేదు.



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇదీ గుంటూరు జిల్లా పరిషత్‌లో నెలకొన్న పరిస్థితి. పాలకవర్గం, అధికారుల మధ్య అగాధం నెలకొందని పై పరిణామాలు చూస్తే అర్థమవుతోంది. జడ్పీ చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య సమన్వయ లోపం పాలనలో ప్రతిబింబిస్తోంది. గుంటూరు జిల్లా మూడు ముక్కలు అయినా జిల్లా పరిషత్ ఇంకా ఉమ్మడిగానే ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల అభివృద్ధి చిరునామా జిల్లా పరిషత్ మాత్రమే. అటువంటి జిల్లా పరిషత్ అంతర్గత కుమ్ములాటల్లో చిక్కుకుంది. పాలకవర్గానికి ప్రతినిధిగా ఉన్న చైర్‌పర్సన్‌కు, కార్యనిర్వాహక వర్గానికి ప్రతినిధులుగా ఉన్న సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య అగాధం ఏర్పడింది. ఏమి జరిగిందో ఏమో కానీ ముగ్గురు మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గు మంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ మధ్య జరిగిన అనేక సంఘటనలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ఇటీవల జడ్పీలో ఈ-ఆఫీసుపై సీఈవో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈవో అందుబాటులో ఉన్నా ఆ సమావేశానికి హాజరుకాలేదు. సీఈవో ఒక్కరే సమావేశాన్ని జరిపించేశారు. గత వారంలో గుంటూరు జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవోలు సచివాలయ వ్యవస్థ వల్ల ఎదురౌతున్న ఇబ్బందులను చైర్‌పర్సన్ ముందు ఏకరువు పెడుతున్నారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న సీఈవో ఆ అంశాన్ని మధ్యలోనే ముగించారు. కొన్ని సందర్భాల్లో చైర్‌పర్సన్ మాట్లాడుతున్నా ఆయన అడ్డుతగిలినట్లు అనిపించింది.

విద్యార్థుల ఎదురుచూపులు..

పదో తరగతి విద్యార్థులకు ఏటా జిల్లా పరిషత్ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఈ ఏడాది పరీక్షలకు కేవలం రెండు నెలల వ్యవధి కూడా లేదు. అయినా ఇంతవరకు ఆ ఊసే వినిపించడం లేదు. జడ్పీ పాఠశాలల్లో స్టడీ అవర్‌కు ఉండే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత జడ్పీదే. గత కొన్ని రోజులుగా పాఠశాలల్లో స్టడీ అవర్లు జరుగుతున్నాయి. అయినా ఇప్పటి వరకు అల్పాహారం ఊసే లేదు. అందుకు సంబంధించిన నిధుల విడుదలపై అసలు చర్చ కూడా జరిగినట్లు లేదు.

ఫైళ్లు చక్కర్లు కొట్టాల్సిందే..

ఇక జడ్పీలో ఏ ఫైల్ అయినా కనీ సం మూడు నెలలకు తగ్గకుండా చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈ వోల చుట్టూ చక్కర్లు కొట్టాల్సిందే. కొన్ని కొన్ని సందర్భాల్లో అసలు ఫైల్ ఎవరి దగ్గర ఉందో తెలుసు కోవడం కూడా కష్టంగానే ఉందని జడ్పీవర్గాల సమాచారం. ఈ పరి ణామాల మధ్య జడ్పీలో ఫైళ్ల వ్యవ హారం కత్తిమీద సాములానే ఉంది. కొన్ని వందల ఫైళ్లు పేరుకుపోయి నట్లు తెలుస్తోంది. ఏ ఫైల్‌ని కూడా సక్రమంగా పరిష్కరించడం లేదన్న విమర్శలున్నాయి. చైర్‌పర్సన్ క్లియర్ చేసిన ఫైల్‌ను సీఈవో పెండింగ్‌లో పెడుతున్నట్లు తెలుస్తోంది. సీఈ వో పంపుతున్న ఫైల్‌ను డిప్యూటీ సీఈవో పెండింగ్‌లో పెడుతున్నట్లు సమాచారం.

ఉద్యోగుల ఇష్టారాజ్యం..

ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో ఉన్న కొందరు ఉద్యోగులకు, అధికారులకు మధ్యాహ్నం వరకే విధులు అన్న విధంగా ఉంది. భోజన విరామం తర్వాత చాలా మంది ఇళ్లకు వెళ్లిపోతున్నారు. అదేమని అడిగే నాథుడు లేకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక వేళ సీఈవో దృష్టికి ఈ విషయం తీసుకువెళ్ళినా మందలించలేని పరిస్థితి.

చెల్లింపులన్నీ బంద్..

జడ్పీలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితిల వల్ల చాలా వరకు చెల్లింపులు నిలిచిపోయాయి. గత సర్వసభ్య సమావేశానికి సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ ఫైల్ ఎవరి దగ్గర పెండింగ్‌లో ఉందో ఎవరికీ తెలియదు. కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు కూడా ఈ మధ్య కాలంలో చాలా కాలం పెండింగ్‌లో ఉంచారు. ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు కూడా చాలావరకు పెండింగ్‌లు ఉన్నట్లు తెలుస్తోంది.

అవినీతి తాండవం..



చైర్‌పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవోల మధ్య ఉన్న అంతరం కారణంగా జిల్లా పరిషత్‌లోని కొన్ని విభాగాల్లో అవినీతి తాండవిస్తోంది. అడిగినంత ఇస్తే తప్ప అక్కడ పనులు కావడం లేదని ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని సెక్షన్ల ఏవోలు ఆడిందే ఆట పాడిందే పాట అన్న విధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో రూ.2 లక్షల వరకు వెచ్చించి జడ్పీకి బదిలీ అయిన అధికారులు వాటిని సమకూర్చే పనిలో ఉన్నట్లు ఆరోపణలున్నాయి.



ఉద్యోగుల్లో.. ఉత్సాహం

- బడ్జెట్‌పై పెన్షనర్ల ఆనందోత్సాహాలు
- పన్ను మినహాయింపుపై ఆయా వర్గాల్లో సంబరాలు
- కొనుగోలు శక్తిని పెంచుతుందంటున్న ఆర్థిక నిపుణులు

బాపట్ల, గుంటూరు, విద్య, తూర్పు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు నిధులు.. పలు ప్రాజెక్టులకు ప్రోత్సాహం.. వివిధ రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో సహకారం ఉంటోందని ప్రజలు ఆశించారు. అయితే ఉద్యోగులు, పెన్షనర్లను మాత్రమే నిర్మలా సీతారామన్ ఉత్సాహపరిచారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పెన్షనర్లు, ఉద్యోగులకు వరాల జల్లు కురిపించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రూ.12.75 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదనే తీపికబురు ప్రకటించారు. దీంతో ఉద్యోగులకు వారి జీతాలను బట్టి రూ.30 వేల నుంచి రూ.80 వేల వరకు ఆర్థిక ఉపశమనం కలుగుతుంది. సంవత్సరానికి రూ.12 లక్షల కంటే ఎక్కువ సంపాదించే సాఫ్ట్‌వేర్ తదితర రంగాలకు చెందిన ఉద్యోగులకు కూడా దీనిని వర్తింపు చేశారు. ఈ విధంగా అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు ఉద్యోగులకు కొత్త ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఆర్థిక ప్రయోజనాలను కల్పించారు. ఎప్పుడైతే బడ్జెట్ ప్రసంగంలో ఈ విషయాన్ని ఆమె ప్రకటించారో ఆ వెంటనే జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. సహచర ఉద్యోగులకు ఫోన్లు చేసుకుని ఎంత లబ్ధి జరుగుతుందో పరస్పరం పంచుకున్నారు. బడ్జెట్‌పై ఆర్థిక, విద్యావేత్తలు, వామపక్షాల నాయకులు తమ అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

జిల్లా వాసుల్లో నిరాశ



బాపట్ల జిల్లాకు ఆయువు పట్టుగా ఉన్న పర్యాటక రంగం గురించి కేంద్ర బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడంతో జిల్లావాసులు నిరాశకు గురయ్యారు. జిల్లాలో ప్రధానమైన మత్స్యకారులు, ఆక్వారంగాలపై నిర్మలమ్మ పద్దు వరాలు కురిపిస్తుందనుకుంటే ఆ ఊసే కరువైంది. గత ప్రభుత్వం శంకుస్థాపనలు చేసి వదిలేసిన అనేక ప్రాజెక్టులకు సంబంధించి నేతలు నిధుల విజ్ఞాపనలు కేంద్రానికి ఇచ్చినా బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కలేదు. సమీకృత ఆక్వా ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో చోటు దక్కకపోవడంతో జిల్లాప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఆక్వా రంగం విషయంలో ఇచ్చిన ప్రతిపాదనలను కూడా కేంద్రం బుట్టదాఖలు చేసిందనే విమర్శలున్నాయి.

వ్యవసాయానికి ఊతం



కేంద్ర బడ్జెట్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో వ్యవసాయరంగానికి ఊత మిచ్చేదిలా ఉన్నది. జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్(జీబీఎన్ఎఫ్)కు రాష్ట్రానికి కేటాయించిన రూ.186 కోట్లలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు భారీగానే నిధులు సమకూరుతాయని వ్యవసాయ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గుంటూరు జిల్లాలో దాదాపుగా 20 వేల మంది ప్రకృతి వ్యవసాయం చేస్తుండగా వారికి ఎంతో ప్రోత్సాహకరంగా ఉండనున్నది. అదేవిధంగా బాపట్ల జిల్లాలో 40,000 ఎకరాల వరకు సాగు విస్తరించొచ్చనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రెండు జిల్లాల్లో కొత్తగా పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపేలా కేంద్ర బడ్జెట్ కేటాయింపులున్నాయని అధికారులు చెబుతున్నారు. కిసాన్ క్రెడిట్‌కార్డుల రుణపరిమితి పెంపుతో లక్షల మంది రైతులకు ఆర్థికంగా లబ్ధి జరుగుతుంది. గుంటూరు జిల్లాలో దాదాపుగా 3.50 లక్షలు, బాపట్ల జిల్లాలో 55,000 మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులున్నాయి. ప్రస్తుతం రుణపరిమితి రూ.3 లక్షలు కాగా దీనిని రూ. 5 లక్షలకు పెంచడంతో వ్యవసాయంతో పాటు మత్స్య, పశు సంవర్థక రంగాల్లో రైతులకు లబ్ధి చేకూరుతోంది. ఎంఎస్ఎంఈలపై వరాలతో గుంటూరు జిల్లాలో దాదాపుగా 71 వేల సంస్థలకు మేలు జరగనున్నది. కొత్తగా పరిశ్రమలను విస్తరణతో పాటు ఉత్పాదక శక్తిని పెంచుకొని ఎగుమతులు మరింతగా చేసే అవకాశం కలుగుతోంది.

పెట్టుబడిదారులకు వరం

కేంద్ర బడ్జెట్ సామాన్యులకు శాపంగా, బడా పెట్టుబడిదారులకు వరంగా ఉంది. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రస్తావనే లేకపోవడం విచారకరం. రైతుల పంటలకు కనీస మద్దతు ధరపై ప్రకటన చేయలేదు. విద్యుత్ రంగంలో సంస్కరణలకు ప్రోత్సాహకాలు దుర్మార్గం. డ్వాక్రా మహిళలు, ఎంఎస్ఎమ్ఈలకు రుణాలు పెంచి ఇస్తామని చెప్పడం వారి చేత అప్పులు చేయించడమే లక్ష్యంగా కనిపిస్తుంది.

- జంగాల అజయ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి, గుంటూరు

రాష్ట్రానికి మొండిచేయి

కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, విభజన హామీలు, రాజధాని నిర్మాణం వంటి విషయాల్లో మొండిచేయి చూపింది. పోలవరానికి రూ 5,936 కోట్లు, ప్రాజెక్ట్ అథారిటీకి రూ 54 కోట్లు కేటాయించారే కానీ నిర్వాసితుల గురించి ప్రస్తావనలేదు. వేతన జీవులకు పన్నులు తగ్గించామని చెబుతూ పేద, బడుగు వర్గాలు, మధ్యతరగతి ప్రజలపై జీఎస్టీ పేరుతో భారాలు మోపుతున్నారు.

- వై నేతాజి, సీపీఎం జిల్లా కార్యదర్శి, గుంటూరు

అన్యాయం.. దురదృష్టకరం

రాష్ట్రాభివృద్ధికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు లేకపోవటం దురదృష్టకరం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటీకరించమని, దానికి ఫైన్స్ కేటాయిస్తామన్న వారు బడ్జెట్‌లో చూపించలేదు.

- మస్తాన్‌వలి, మాజీ ఎమ్మెల్యే, గుంటూరు

నిరాశ మిగిల్చింది

కేంద్ర బడ్జెట్ నిరాశ మిగిల్చింది. విభజన చట్టంలో హామీలకు నిధులు కేటాయించలేదు. వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు, చర్యలు లేవు. ఉపాధి పెంచే దిశగా బడ్జెట్ లేదు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే దిశగా బడ్జెట్ ఉంది. ప్రైవేటీకరణకు అన్ని రంగాల్లో పెద్దపీటవేశారు.

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

ఐటీకి శుభపరిణామం

మధ్య తరగతి వారిని దృష్టిలో పెట్టుకుని ఐటీ విధానంలో మినహాయింపులు కల్పించినట్లుగా భావించవచ్చు. ఆదాయపు పన్ను శ్లాబు విధానంలో మార్పులు, టీడీఎస్, టీసీఎస్ విధానాల్లో కూడా మినహాయింపులు కల్పించారు. వీధి వ్యాపారులకు ముఖ్యంగా రూ.30 వేల వరకు క్రెడిట్ కార్డ్స్ అందజేస్తామని చెప్పారు. వడ్డీ వ్యాపారుల భారిన పడి వీధి వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. క్రెడిట్ కార్డ్స్ విధానంతో వారికి ఆర్థిక పరిపుష్టి కల్పించినట్లవుతుంది. వడ్డీపై టీడీఎస్‌ను సీనియర్ సిటిజన్లకు పెంచటం మంచి విషయంగా చెప్పవచ్చు.

- రామరాజు శ్రీనివాస్, మాజీ చైర్మన్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ సౌత్‌జోన్

ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

ఆదాయపు పన్ను శ్లాబు విధానంలో మార్పులు ఆర్థికాభివృద్ధికి దోహదం చేకూరుస్తుంది. కరోనా వలన ఆర్థిక వ్యవస్థకు కొంతమేరకు ఇబ్బంది కలిగింది. ఈ నేపథ్యంలో పన్ను మినహాయింపుల వల్ల ఉద్యోగులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. దాంతో వారు కచ్చితంగా తమకు ఇష్టమైన వస్తువులను కొనుగోలు చేయడం, స్థిరాస్తి, రియల్‌ఎస్టేట్ రంగాల్లో పెట్టుబడులు పెట్టడం వంటివి చేస్తారు. ఇది ఆర్థిక వ్యవస్థని బూస్టప్ చేస్తుంది. బడ్జెట్‌తో చిన్న పరిశ్రమలు, రైతులకు భారీ ఊరట లభించింది.

- ఆడిటర్, దామచర్ల శ్రీనివాసరావు, గుంటూరు

జీఎస్టీ శ్లాబులు తగ్గించకపోకవడం సరికాదు

జీఎస్టీ శ్లాబులు తగ్గించాలని తొలి నుంచి డిమాండ్ చేస్తూ వస్తున్నాం. బడ్జెట్ ప్రకటనలోనూ శ్లాబులను తగ్గించపోవటం విచారకరం. రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయింపులు లేకపోవడం నిరాశ కలిగించింది. బడ్జెట్‌లో చిన్న వ్యాపారులకు పెద్దగా లాభం చేకూర్చింది లేదు.

- ఆతుకూరి ఆంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్విత గౌరవాధ్యక్షుడు.

రేషన్.. కోత



అరకొరగానే కందిపప్పు

- బియ్యం, పంచదారకే పరిమితం
- రాగి, గోధుమ పిండి, జొన్నలు నిలిపివేత

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రేషన్ సరుకులు అంటే.. బియ్యం, పంచదారకే పరిమితమైంది. గతంలో రేషన్ అంటే బియ్యం, పంచదార, కందిపప్పు, రాగులు, సజ్జలు, గోధుమలు, గోధుమపండి, మార్కెట్‌లో అధిక ధరలున్న నిత్యావసరాలు సబ్సిడీపై అందేవి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల రేషన్ వ్యవస్థను పూర్తిగా మార్చేయడంతో పాటు సరుకుల్లో కోత విధించింది. రేషన్ కార్డుదారులకు బియ్యం మాత్రం అందించారు. కొన్ని దగ్గర్ల అయితే పంచదార కూడా సక్రమంగా అందేది కాదు. ఇక బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు, నూనెలు మండిపోతున్నా వాటి ఊసే నాటి ప్రభుత్వం మరిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్‌లో కొన్నింటిని పునరుద్ధరించినా అది రెండు నెలలకే పరిమితమైంది. ప్రస్తుతం గత వైసీపీ హయాంలో మాదిరిగానే బియ్యం, పంచదారకే రేషన్ పరిమితమైంది. పేదలకు సరుకుల పంపిణీలో కూటమి ప్రభుత్వం కూడా కోత విధించింది. ఏ నెలకానెల కందిపప్పు పంపిణీ తగ్గించి వేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ విస్మరించింది. కందిపప్పు అడిగితే పంపిణీ దారులు స్టాక్‌లేవంటున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు గోధుమ, రాగి పిండి సరఫరా నిలిచిపోయింది. జొన్నలు ఒక్క పల్నాడు జిల్లాకే అది కూడా 7.80 లక్షల కార్డుదారులకు, గుంటూరు జిల్లాలో 1,464 మంది కార్డుదారులకు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల జిల్లాకు జొన్నల సరఫరా పూర్తిగా నిలిపివేశారు. రాగి పిండి గుంటూరు జిల్లాలో 115 మంది కార్డుదారులకు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల, గుంటూరు జిల్లాలకు రాగి పిండి పూర్తిగా నిలిపివేశారు. కందిపప్పు 20 శాతానికి లోపే పరిమితం కావడం, రాగి, గోధుమ పిండి, జొన్నలు సరఫరా నిలిపివేయడంతో కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


జొన్నలు

20 శాతమే కందిపప్పు..

పల్నాడు జిల్లాలో 6,34,913 కార్డుదారుల్లో ఈ నెలలో కేవలం 20.52 శాతం మందికి మాత్రమే కందిపప్పు సరఫరా చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. 1,16,759 ప్యాకెట్లకు డీలర్ల నుంచి ఇండెంట్ రాగా శనివారం వరకు 90,178 ప్యాకెట్లు సరఫరా చేశారు. బాపట్ల జిల్లాలో 4,76,553 కార్డులకు 11.43 శాతం మాత్రమే కందిపప్పు సరఫరా చేయనున్నారు. డీలర్ల నుంచి 51,106 ప్యాకెట్లకు ఇండెంట్ రాగా 48,626 ప్యాకెట్లను డీలర్లకు అందజేశారు. గుంటూరు జిల్లాలో 5,89542 కార్డుల్లో 20.95 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేయనున్నారు. 1,16,673 ప్యాకెట్లకు ఇండెంట్ రాగా 1,11,403 ప్యాకెట్లను డీలర్లకు అందజేశారు.

చోరీ చేసి లక్ష మద్యం తాగేశారు

- రెండు మద్యం షాపుల్లో దొంగతనాలు
- వినుకొండకు చెందిన 8 మంది అరెస్టు

అద్దంకి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు, బేల్దారు పనులు చేస్తూ చిల్లర దొంగతనాలతో మద్యం వ్యసనాలకు లోనైన ఎనిమిది మంది కలిసి మద్యం దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. వినుకొండకు చెందిన వారు స్థానికంగా చోరీలకు పాల్పడితే దొరికిపోతామని అద్దంకి, బల్లికురవ మండలాల్లోని మద్యం షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. అద్దంకి ప్రాంతంలో రెండు మద్యం షాపుల్లో చోరీ చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ముఠాను శనివారం మీడియా ఎదుట హాజరుపరిచిన చీరాల డీఎస్పీ మొయిన్ వివరాలు వెల్లడించారు. వినుకొండలో నివాసం ఉంటున్న మంగళగిరికి చెందిన మందూరి శ్రీరామ్(శాస్త్రి), నూజెండ్ల మండలం ఐనవోలుకు చెందిన తూమాటి చరణ్(ఇర్ఫియ), ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం లేళ్లపల్లికి చెందిన పోలా వెంకటరెడ్డి, బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడుకు చెందిన నక్కా లక్ష్మణరావు(లక్కి), వినుకొండకి చెందిన సిద్దాబత్తుల రామసాయి, షేక్ చినఫరీద్‌బాషా(పండు), వేముల నాగరాజు, అనిల్ గతంలో పలు చోట్ల బడ్డీ కొట్లలో దొంగతనాలు చేసి జల్సాలకు అలవాటు పడ్డారు. మద్యం షాపుల్లో దొంగతనాలు చేస్తే పెద్ద మొత్తంలో మద్యం, నగదు దొరుకుతుందని గత నెల 27న వినుకొండ నుంచి శ్రీరామ్‌కు చెందిన కారులో అద్దంకి మండలం శాంతినగర్‌కు వచ్చారు. ఆ సమీపంలోని మారుతీ వైన్స్ షట్టర్ పగలగొట్టి రూ.2,37,630 విలువైన మద్యం బాటిళ్లను దొంగలించారు. ఆ తర్వాత బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు సమీపంలోని అంకమ్మతల్లి వైన్స్ వద్దకు వచ్చి వాచ్‌మన్‌ను బెదిరించారు. అతడు పారిపోగా షాపు తాళం పగలగొట్టి అందులో 20 వేల రూపాయల నగదు, 96 మద్యం బాటిళ్లు, సెల్‌ఫోన్ చోరీ చేశారు. టెక్నాలజీ సహాయంతో వినుకొండకు చెందిన వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో శనివారం ఏడుగుర్ని అరెస్టు చేయగా అనిల్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. రూ.1,59,130 విలువైన 433 మద్యం బాటిళ్లు, 10వేల నగదు, గడ్డపార, కారును స్వాధీనం చేసున్నారు. 4 రోజుల వ్యవధిలో సుమారు రూ.లక్ష విలువైన 348 మద్యం బాటిళ్లు మద్యం తాగడంతో పాటు స్నేహితులు, బంధువులకు పంచినట్లు డీఎస్పీ తెలిపారు. తక్కువ ధరకు అమ్మకాలు చేశారన్నారు.



మణికేశ్వరంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు

మణికేశ్వరంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారుల విచారణ

అర్హులైన ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు మంజూరు

అద్దంకి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామమైన మణికేశ్వరంలో నివేశన స్థలాల విషయమై ప్రాజెక్టు అధికారులు శనివారం గ్రామస్థులతో చర్చించారు. ఎస్సీ కాలనీ వాసులకు నివేశన స్థలాలు కేటాయింపు జరగకపోవడంతో ఇటీవల మంత్రి రవికుమార్‌కు సమస్యలను వివరించారు. ఈ నేపథ్యంలో గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో శనివారం ప్రాజెక్టు అధికారులు నాగేశ్వరి, శ్రీదేవి గ్రామస్థులతో చర్చించారు. అర్హులై ఉండి ఎస్ఈఎస్ సర్వే లో నమోదైన ప్రతి కుటుంబానికీ నివేశన స్థలాలు ఇస్తామని అధికారులు తెలిపారు. ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, మేకల ఆదినారాయణ, రఫీ, ఈసువలి, సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేస్తే చర్యలు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, లేదా ఆక్రమణలకు పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ పార్వతి హెచ్చరించారు. వేటపాలెం మండల పరిధిలోని సిలోనుకాలనీలో సర్వే నెంబర్ 370లోని 4.50 ఎకరాల భూమికి సంబంధించి కొంతకాలంగా విద్యుత్‌శాఖ, తమిళ ప్రాంత వాసుల మధ్య ప్రభుత్వం తమకిచ్చిందంటే తమదంటూ వివాదం జరుగుతోంది. ఈనేపథ్యంలో ఆ స్థలంపై ఇప్పటికే కోర్టు సీఆర్‌పీసీ 145 ఆదేశాలు జారీ చేసింది. అయినా ధిక్కరిస్తూ తమిళ వాసులు రేకుల షెడ్లు వేస్తుండడంతో విద్యుత్ ఏఈ రవితేజ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన తహసీల్దార్ పార్వతి ఎస్సై వెంకటేశ్వర్లు పోలీసు బందోబస్తుతో వెళ్లి స్థలంలో నిర్మించిన ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. మొదట అధికారులు తమిళ వాసుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. అయినా తహసీల్దార్ తనదైన శైలిలో చర్యలు చేపట్టారు.

ప్రయోగాలను వెలికి తీయాలి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నిత్యం జీవితంలో ఉపయోగపడే ప్రయోగాలను వెలికి తీయాలని చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు. గత అయిదు రోజులుగా కళాశాలలో సీఎస్ఈ రెండు, మూడు సంవత్సరం విద్యార్థులకు జరుగుతున్న హెకథాన్ ఆన్‌ఏఐ ఫుల్‌స్టాక్ వర్క్‌షాప్ శనివారంతో విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ డా.కే.జగదీష్ చెప్పారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు నేర్చుకున్న మెళకువలతో ప్రదర్శనలు చేయగా, అధికారులు పరిశీలించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డా.హరిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి వనరులకు చిత్తడి నేలలు మూలాధారం

చీరాలటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నీటి వనరులకు, తాగునీటికి మూలాధారం చిత్తడి నేలలని వీటిని పరిరక్షించేందుకే వరల్డ్ వెట్ ల్యాండ్ డే(చిత్తడి నేల దినోత్సవం)ను జరుపుకుంటున్నామని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, జిల్లా సైన్స్ అధికారి సాధిక్ అన్నారు. జాండ్రపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేటపాలెం మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్ర, నదీ తీర ఇతర నీటి వనరుల తీర ప్రాంతాల్లో లోతు తక్కువ ఉండి ఎక్కువ కాలం నీటి నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలు అంటారన్నారు. అరుదైన మొక్కలకు, పక్షులకు, జంతువులకు, చేపలకు గుడ్లు పెట్టేందుకు ఇవే అనువైన స్థావరాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుమ్మడి శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధేనువకొండ పునరావాసకాలనీ పాఠశాలల పరిశీలన

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ధేనువకొండ ముంపు గ్రామానికి సంబంధించి ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలలో పాఠశాలల ప్రస్తుత పరిస్థితిపై పూర్తి వివరాలను పంపాలని సమగ్ర శిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగిరెడ్డి మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని ధేనువకొండ పునరావాసకాలనీలైన బలరామకృష్ణపురంలో నిరుపయోగంగా ఉన్న ఉన్నత పాఠశాల భవనాన్ని, ఆట స్థలం, ప్రాథమిక పాఠశాలను పరిశీలించడంతో పాటు వేలమూరిపాడు సమీపంలోని పునరావాస కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆయన విద్యాశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. దేనువకొండ ముంపు గ్రామం, అక్కడ ఉన్న పాఠశాలలు, ఉన్న విద్యార్థుల వివరాలు తెలుసుకోవడంతో పాటు పునరావాసకాలనీలు ఏఏ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు, ఎంతమంది నివాసముంటున్నారు, విద్యార్థులు చదువుతున్నారా అనే వివరాలను పంపాలన్నారు. పాఠశాలల భవనాలను ప్రాజెక్టు పరిధిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. పాఠశాలలు ప్రారంభించకుండా నిరుపయోగంగా ఉండడంపై ఆరా తీశారు. ముంపు గ్రామం, పునరావాసకాలనీల పరిస్థితి, వసతులు లేకపోవడం వంటి వివరాలను ఏఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ నాగిరెడ్డికి వివరించారు. బలరామకృష్ణపురంలోని ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరును తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులతో పాఠ్యపుస్తకాలను చదివంచారు. ఆయనవెంట ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు, ఉపాధ్యాయులు కేశవరావు, సుబ్బారావు, అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.



బలరామకృష్ణపురంలో హైస్కూల్ వివరాలను తెలుసుకుంటున్న సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగిరెడ్డి

రాజముద్రతో పాస్ పుస్తకాలు

- వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు
- మంత్రి గొట్టిపాటి

పంగులూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భూ యజమానులైన రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందచేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో గ్రామాలవారీగా నాయకులు, కార్యకర్తలతో ప్రజా సమస్యలపై శనివారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి బొమ్మతో జారీ చేసిన పాస్ పుస్తకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఎవరైతే భూ హక్కుదారులు ఉన్నారో వారందరికీ రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు త్వరితగతిన అందచేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అవసరమైన రైతులందరికీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల జారీకి ఆదేశాలిచ్చామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. పంగులూరు నుంచి ముప్పవరం, తూర్పు కొప్పెరపాడు వైపు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులు నిలిచిన కారణంగా ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు మంత్రికి తెలిపారు. రోడ్డు మరమ్మతుల విషయంలో జాప్యంపై అధికారులను ప్రశ్నించిన మంత్రి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై చర్యలకు ఆదేశం

పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురవుతున్నాయని, వాటిని అరికట్టడంతో పాటు, కొనుగోలు చేసిన వారి నుంచి సొమ్ము రికవరీ చేయాలని చీరాల డీఎస్పీ మొయిద్దీన్‌ను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న నివేశన స్థలాలు, భూ సమస్యలు, పాల డెయిరీతో తలెత్తిన పొల్యూషన్ సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సింగారావును, బీఆర్‌పాలెం, పంగులూరు, జేవీపాలెం, అలవలపాడు తదితర గ్రామాలలో విద్యుత్ తీగలు, స్తంభాల సమస్యలను పరిష్కరించాలని ఏడీ మస్తానరావును ఆదేశించారు. సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణం కోరుతూ పలు గ్రామాల నుంచి దరఖాస్తులు అందజేశారు. నిధులు సమకూరినవవెంటనే రోడ్ల నిర్మాణ పనులు చేపడతామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు, ఏఈ అనిల్, టీడీపీ నాయకులు కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, ఏడుకొండలు, డీసీ చైర్మన్ ఆంజనేయులు, బ్రహ్మానందస్వామి, గుర్రం ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, చింతల సహదేవుడు, వరపర్ల సుబ్బారావు, రమేష్, వెంకటేశ్వర్లు, రవి, గడ్డం నాగేశ్వరరావు, సర్పంచ్ ధూళిపాళ్ల వెంకటరావు, కాజా, సుబ్బారావు, రామాంజనేయులు, చంద్రశేఖర్, కోమటి ప్రసాద్, కాటా అంజయ్య, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

మనోహర్‌ను పరామర్శించిన మంత్రి

అనారోగ్యంతో వైద్య చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ కార్యకర్త గోనుగుంట్ల మనోహర్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు.

అర్హులందరికీ ఎలక్ట్రానిక్ ట్రై సైకిళ్ల పంపిణీ

నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులందరికీ ఎలక్ట్రానిక్ ట్రై సైకిళ్లను అందజేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముప్పవరం టీడీపీ కార్యాలయంలో బల్లికురవ మండలానికి చెందిన కొత్తపాలెం, గంగపాలెం, కొత్తూరు, వల్లాపల్లి, కొప్పెరపాడు, ఉపమాగులూరు, బొడ్డువానిపాలెం, అద్దంకి, కొరిశపాడు, సంతమాగులూరుకు చెందిన 14 మంది దివ్యాంగులకు ఉచిత బ్యాటరీ చార్జింగ్ ట్రై సైకిళ్లను మంత్రి గొట్టిపాటి అందచేశారు. వీటి విలువ షుమారు రూ.7లక్షలు కాగా, వీటిని జైపూర్ అలింకో సంస్థ ద్వారా అందచేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 40 ట్రై సైకిళ్లను అందచేసినట్లు మంత్రి తెలిపారు. బల్లికురవ దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు దమ్ము అంజయ్య ట్రై సైకిళ్ల పంపిణీ విషయంలో చేస్తున్న కృషిని అభినందించారు.



గ్రామ సమస్యలపై నేతలతో చర్చిస్తున్న మంత్రి గొట్టిపాటి

నేడు పల్నాటి అంకమ్మతల్లి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని డిగ్రీ కళాశాల సమీపంలో గల జాతీయ రహదారి వద్ద శ్రీ పల్నాటి అంకమ్మతల్లి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరుగుతున్నట్లు కమిటీ ప్రతినిధులు శనివారం ప్రకటనలో తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నసంతర్పణ జరుగుతుందని భక్తులు విశేషంగా హాజరయి అమ్మ కృపకు పాత్రులు కావాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

ప్రశాంతంగా ముగిసిన అత్యవసర కౌన్సిల్

స్వల్పవాదన.. రెండు అంశాలతో వాయిదా

చీరాలటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అధ్యక్షతన ప్రశాంతంగా ముగిసిం ది. శుక్రవారం వాదనల నడుమ వాయిదా పడిన సమావేశం తిరిగి శనివారం కొంత ఆసక్తికరంగా సాగింది. కార్యక్రమం ప్రారంభంలో అజెండాలోని మొదటి రెండు అంశాలపై కొద్దిసేపు చర్చ సాగింది. వీటిపై వైస్ చైర్మన్ వాయిదా వేయడంతో వైసీపీ 12వ వార్డు కౌన్సిలర్ మామిడాల రాములు అసంతృప్తితో సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం చర్చ జరిగిన రెండు అంశాలను వాయిదా వేస్తూ తదుపరి 13 అంశాలకు ఆమోదం తెలపడంతో సభ ముగిసింది. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందితో సమీక్షిస్తున్న న్యాయాధికారి శాంతి

లోక్ అదాలత్‌పై సమీక్ష

పర్చూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.శాంతి పోలీసు సిబ్బందితో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కక్షలు కార్పణ్యాలకు తావులేకుండా రాజీ మార్గంలో ఇరువర్గాల సమ్మతితో కేసులను పరిష్కరించుకునేలా పోలీసులు చొరవచూపాలన్నారు.

కేఆర్‌కెలో 4, 5, 6 తేదీల్లో అంతర్జాతీయ వెబ్‌నార్

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా ఫిబ్రవరి 4, 5, 6 తేదీల్లో భాష, జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో పరివర్తన శీర్షికతో మూడురోజులు జూమ్ అంతర్జాల వేదిక ఆధారంగా విద్యార్థి ఆధారిత అంతర్జాతీయ వెబ్‌నార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు, నిర్వాహక విభాగాల అధ్యాపకులు తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వెబ్‌నార్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

రాష్ట్రంలో 64లక్షల మందికి పింఛన్‌లు

మంత్రి గొట్టిపాటి

పంగులూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 64 లక్షల మందికి సామాజిక పింఛన్లు అందిస్తున్నామని, దేశం లో అత్యధిక పింఛన్లు అందిస్తున్న రాష్ట్రం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామ ఎస్టీ కాల నీలో శనివారం మంత్రి గొట్టిపాటి సామాజిక పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పింఛన్‌ల విషయంలో జగన్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని, పెంచిన వెయ్యి రూపాయల పింఛన్ ఇచ్చేందుకు నాలుగేళ్లు పట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబా బు ఒక్క సంతకంతో రూ.3వేల నుంచి రూ.4వేలకు, దివ్యాంగులకు రూ.6వేలు, నూరు శాతం వైకల్యం ఉన్నవారికి రూ.15 వేలకు పెంచారన్నారు. ప్రతినెలా 1వ తేదీన ఇంటివద్దకు వచ్చి పింఛన్ ఇస్తున్నారని మంత్రి వివరించారు. త్వరలో అర్హులైనవారికి కొత్త పింఛన్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, పీఆర్ ఏఈ హనుమంతరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, బాలిన రామసుబ్బారావు, ఏడుకొండలు, బ్రహ్మానందస్వామి, డీసీ చైర్మన్ ఆంజనేయులు, సహదేవుడు, సుబ్బారావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, కార్యదర్శి జానీబేగం పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్ : నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్ర జలు టీడీపీ కూటమి ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీని శనివారం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెం, వేటపాలెం మండల పరిధిలోని మసీద్ సెంటర్, మున్సిపల్ పరిధిలోని 29, 9 వార్డులలో పాల్గొని పెన్షన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో వేగవంతంగా రూ.10కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రోడ్ల నిర్మాణాలకు మంజూరయినట్లు తెలిపారు. రూ.2.40కోట్లతో గోకులం షెడ్లకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈపూరుపాలెం : ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరాలని సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. ఈపూరుపాలెం జరుగుతున్న పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణను కలిసి ఆర్డీవో పర్యవేక్షించారు. అర్హులకు పంపిణీ విషయంలో జా ప్యం ఉండరాదని సూచించారు. సమస్యలు ఉన్నప్పుడు తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు యోగేంద్ర ప్ర సాద్, కృష్ణారెడ్డి సిబ్బంది ఉన్నారు.

యవకులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, విద్య, ఆట పాటలతో పాటు అన్ని రకాల నైపుణ్యాలపై దృష్టిసారించి ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. 22వ వార్డు వాలీబాల్ కోర్టు మరమ్మతులకు పట్టణాధ్యక్షుడు గజవల్లి శ్రీను రూ.20 వేలు ఆర్థిక సాయంను ఎమ్మెల్యే చేతుల మీదుగా వార్డు ఇంచార్జి కిరణ్ కుమార్‌కు అందజేశారు. ఈసందర్భంగా యువతకు పలు సూక్తులను ఎమ్మెల్యే చెప్పారు.

చినగంజాం : పింఛన్‌ల పంపిణీని శనివారం ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి పరిశీలించారు. చినగంజాం, కడవకుదురు,మున్నంవారిపాలెం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, సోపిరాల, పెదగంజాం, పల్లెపాలెం తదితర గ్రామాల్లో జరుగుతున్న పెన్షన్ పంపిణీని ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలో 5866 మంది పెన్షన్‌దారులకు గాను 5543 మందికి పెన్షన్ పంపిణీ చేసి 94.5శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి సోమవారం అందజేయనున్నట్లు తెలిపారు.

మేదరమెట్ల : కొరిశపాడు మండలంలో శనివారం పింఛన్‌ల పంపిణీని జడ్పీ డిప్యూటీ సీఈవో పావులూరి బాలమ్మ అధికారులతో కలిసి పరిశీలించారు. మేదరమెట్లలోని పలు ప్రాంతాలల్లో పెన్షన్ పంపిణీని ఎంపీడీవో రాజ్యలక్ష్మితో కలిసి పరిశీలించారు.



ముప్పవరం ఎస్టీ కాలనీలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న మంత్రి గొట్టిపాటి, వేటపాలెంలో పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి, ఏపీడీ కోటయ్య నాయక్

ఉపాధితో వలస పోకుండా చూడాలి

బల్లికురవ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రోజువారీ కూలీలు వలసలు పోకుండా ఉపాధి పథకంలో కూలి పనులు ప్రారంభించాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం జరిగింది. ఏపీడీ కోటయ్య నాయక్ మాట్లాడుతు గ్రామానికి 100 మందికి తగ్గకుండా పనులకు వచ్చేలా సిబ్బంది చూడాలన్నారు. అన్ని గ్రామాలలో 25 నుంచి 50 మందితో శ్రమశక్తి సంఘాలుగా ఏర్పాటు చేసి కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఎక్కడైన బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవు అన్నారు. పనులకు వచ్చిన కూలీలకు సకాలంలో కూలి నగదు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఏపీవో రమాదేవి పాల్గొన్నారు.

76 మందికి కంటి పరీక్షలు

బల్లికురవ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో బల్లికురవ ఎల్వీ ప్రసాద్ నేత్రాయలం సిబ్బంది శనివారం 76 మందికి ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. ఈసందర్భంగా 9 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరం అని గుర్తించారు. వారికి కారంచేడులో ఉన్న నేత్రాయలయంలో ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. కళ్లజోళ్లు అవసరం అయిన వారికి బల్లికురవలో అందజేస్తామని వారు తెలిపారు. తప్పని సరిగా ప్రతి మూడు మాసాల కోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని వారు ఈసందర్భంగా ప్రజలకు సూచించారు.

జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మృతి

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి



వీరవసంతకుమారి

కారంచేడు (పర్చూరు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామానికి చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యురాలు జాగర్లమూడి వీరవసంతకుమారి (జేఆర్‌కె సతీమణి) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆమె మృతిపట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వీరవసంత కుమారి మృతి టీడీపీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. జడ్పీటీసీగా కారంచేడు మండలాభివృద్ధికి ఎంతగానో కృషి చేసారని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె చేసిన కృషిని కొనియాడారు.

వాహనదారులు హెల్మెట్‌ను ధరించాలి

మార్టూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని చీరాల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని రాజుపాలెం రెస్ట్ ఏరియాలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బొల్లాపల్లి టోల్‌ప్లాజా మేనేజరు శ్రీమన్నారాయణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో చీరాల ఎంవీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులు జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం హైవే రూట్ ఆఫీసరు గిరిబాబు మాట్లాడుతూ దూరప్రాంతాలు ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా రెస్ట్ ఏరియాలను వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో శ్రీనివాసా విద్యా సంస్థల డైరెక్టర్ వీరగంధం శ్రీనివాసరావు, వివేకానంద విద్యా సంస్థల డైరెక్టర్ ఏలూరి కృష్ణమూర్తి, కనుమూరి రామ్‌ప్రసాద్, లారీ, ఆటో, స్కూల్ బస్సుల డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

మేదరమెట్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో గాజు ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడి మృతి చెందింది. జాతీయ రహదారిలో కొరిశపాడు, పి.గుడిపాడు మధ్య రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని గుర్తు తెలియనివాహనం ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను హైవే పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. వృద్ధురాలి వివరాలు తెలియరాలేదు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్ వాహనం

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సును టిప్పర్ వాహనం ఢీకొన్న ఘటన కారంచేడులోని కొమ్మమూరు కాలువపై శనివారం చోటుచేసుకుంది. కారంచేడు మండలం స్వర్ణ నుంచి చీరాల వెళుతున్న బస్సును పర్చూరు నుంచి చీరాల వైపు వెళుతున్న టిప్పర్ ఢీకొట్టింది. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అద్దంకి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ మార్కెట్ యార్డులో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు గుండ్లకమ్మ నది నుంచి నీటి సరఫరా చేసే పైప్‌లైన్‌కు అత్యవసరంగా మరమ్మతులు దృష్ట్యా పలు కాలనీలకు ఆదివారం మంచినీటి సరఫరా జరగదని కమిషనర్ రవీంద్ర తెలిపారు. 4వ వార్డు పరిధిలోని ఎల్ఈఎఫ్‌నగర్, కల్యాణ మండపం రోడ్డు, స్టేట్‌బ్యాంక్ కాలనీ, 5వ వార్డులో వాసవీ నగర్, సాయినగర్, న్యూ ఎస్‌బీఐ కాలనీ, రాజీవ్‌కాలనీ, 6వ వార్డు పరిధిలోని మధురానగర్, భిక్షాలుకాలనీ, రామ్‌నగర్, బలిజపాలెం, గాజుల పాలెం, గ్యాస్‌గోడౌన్ రోడ్డు, 7వ వార్డు మొండితోకపాలెం, గొర్లమిట్ట, 8వ వార్డు రామకృష్ణాపురం, శ్రీరామ్‌నగర్, నర్రావారిపాలెం, గొరకాయ పాలెం, 9వ వార్డు బలిజపాలెం, పాతపసుమర్తిపాలెం,చాకలిపాలెం, సాయిబాబాగుడి, 10వ వార్డు శ్రీనగర్, కొత్తపసుమర్తిపాలెం,చైతన్య నగర్ లలో నీటి సరఫరా ఉండదని తెలిపారు. ఆయా ప్రాంతాలలో శనివారం కూడా నీటి సరఫరా జరగలేదు. సోమవారం నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు.

నేడు మండలంలో మంత్రి గొట్టిపాటి పర్యటన


పంగులూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు చినమల్లవరం, 10.30 నిమిషాలకు బూదవాడ గ్రామాలలో పర్యటించనున్నట్లు కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

పిట్టువారిపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని పిట్టువారిపాలెం గ్రామంలో శనివారం శ్రీ అభయాంజనేయస్వామి, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విశేష పూజలు నిర్వహించగా కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పాఠశాల స్థల దాత నాదెండ్ల పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.నాగేశ్వరరావు అధ్యక్షతన పాఠశాల శ్రేయోభిలాషుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 50 మంది విద్యార్థులకు దాత పూర్ణచంద్రరావు 40 వేలతో క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పీడీ లావణ్య, ఉపాధ్యాయులు వంగెవరపు రమేష్, శ్రీనివాసులు, వెంకటరావు, జి. శ్రీను, పద్మవతి పాల్గొన్నారు.



94.13 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం సర్వర్ మొరాయించినా సజావుగానే సాగింది. జిల్లాలో 94.13శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఉదయం 7గంటలకు సంగం మండలం గాంధీజన సంఘం, వెంకటేశ్వరపురం, సంగం, ఏఎస్ పేట మండలం హసనాపురం గ్రామాల్లో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. అనంతరం ఆమె పెన్షన్లు పంపిణీ చేశారు. శనివారం సాయంత్ర ఏడుగంటల వరకు 3,08,266 పింఛన్లుకుగానూ 2,90,163 పింఛన్లను పంపిణీ చేశారు.

మురిపించి.. మెప్పించి

- వేతన జీవులు, వృద్ధులకు ఊరటనిచ్చిన కేంద్ర బడ్జెట్
- రుణ పరిమితి పెంపుతో రైతులకు ఊరట
- జిల్లాలో కేన్సర్ స్ర్కీనింగ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం



నెల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వేతన జీవులు, రైతులను కరుణిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటనలు చేసింది. శనివారం పార్లమెంటులో కేంద్ర విత్తమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ రెండు వర్గాలకు భారీ ఊరట లభించింది. ఒక వర్గానికేమో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచగా, మరో వర్గానికేమో రుణ పరిమితిని పెంచుతూ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులకు నిధులు దక్కగా, జిల్లా కూడా లబ్ధి పొందనుంది. ఇప్పటివరకూ సంపాదన రూ.7 లక్షలలోపు ఉంటే ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే ఆ పరిమితిని తాజా బడ్జెట్‌లో రూ.12 లక్షలకు పెంచారు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న సుమారు 20 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, మరో 20 వేల మంది ప్రైవేటు ఉద్యోగ, వ్యాపారులకు లాభం చేకూరనుంది. అలానే కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు ఇప్పటివరకూ రూ.3 లక్షల వరకు రుణాలను అందించేవారు. ఇకపై ఆ పరిమితిని రూ.5 లక్షలకు పెంచారు. ఈ కార్డులు కలిగిన జిల్లాలో సుమారు 30 వేల మంది రైతులకు లబ్ధి జరగనుంది. పీఎం కిసాన్ పథకాన్ని కొనసాగించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. తద్వారా జిల్లాలో 1.66 లక్షల మందికి ఏటా పెట్టుబడి సాయం అందనుంది.

● కేన్సర్ రోగులకు ఊరట

ప్రతి జిల్లాలోనూ కేన్సర్ స్ర్కీనింగ్ సెంటర్ ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఆ లెక్కన జిల్లాలో కూడా ప్రభుత్వ కేన్సర్ స్ర్కీనింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది. మూడేళ్లలో దీనిని నిర్మించనున్నారు. దీని ద్వారా అనేక మంది కేన్సర్ బాధితులకు భరోసా లభిస్తుంది. కేన్సర్ స్ర్కీనింగ్‌కే ఇప్పుడు రూ.వేలు ఖర్చవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే సెంటర్‌తో ఆ భారం పేదలపై తగ్గనుంది.

● ఇక రాష్ట్రంలో రోడ్లు, వంతెనల అభివృద్ధికి రూ.239 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఆ కేటాయింపుల్లో జిల్లాకు కూడా భారీగానే నిధులు దక్కే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతు న్నారు. జిల్లాలో ఇప్పుడిప్పుడే నేచురల్ ఫార్మింగ్‌పై రైతులకు ఆసక్తి పెరుగుతోంది. తాజా బడ్జెట్‌లో కూడా నేచురల్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించేందుకు నిధులు కేటాయించారు. అందులో రాష్ట్రానికి రూ.186 కోట్లు కేటాయించగా, ఆ వంతు జిల్లాకు కూడా నిధులు దక్కనున్నాయి. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, సాగరమాల ప్రాజెక్టుకు కూడా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అయితే, అందులో జిల్లాలో జరుగుతున్న పనులకు ఎంత మేర నిధులు దక్కుతాయన్నది ప్రత్యేకంగా చెప్పలేదు. దీనిని ఆయా శాఖలు ప్రకటించాల్సి ఉంది.

● ఎంఎస్‌ఎంఈలకు భారీ ఊతం

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు కేంద్రం చేయూతనిచ్చింది. ఈ పరిశ్రమలకు రుణ పరిమితి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచారు. దీని మూలంగా జిల్లాలోని సుమారు 14 వేల ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు లబ్ధి చేకూరడమే కాకుండా కొత్త పరిశ్రమల ఏర్పాటుకు మంచి అవకాశాలు ఏర్పడినట్టు అయింది.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

- 10వ పేజీలో..



సంక్షేమానికి పెద్దపీట

పేద, మధ్యతరగతి ప్రజలు, రైతుల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఏపీకి ప్రాధాన్యత ఇవ్వటం సంతోషకరం. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునేలా ఈ బడ్జెట్ ఉంది. వ్యక్తిగత ఆదాయపు పన్నును రూ.12 లక్షలకు పెంచటం చాలా పెద్ద నిర్ణయం. మధ్యతరగతి వర్గానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎంఎస్ఎంఈలు, చిన్నపరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ కేటాయింపును రూ.5కోట్ల నుంచి 10కోట్లకు పెంచటం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమల స్థాపన జరిగడానికి అవకాశం ఏర్పడింది.

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ



వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1.75 లక్షల కోట్లు కేటాయించడం శుభపరిణామం. గ్రామీణ అభివృద్ధికి రూ.2.68 లక్షల కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.98 వేల కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. గత ఐదేళ్లలో ఆర్థికంగా చితికిపోయిన ఏపీని అన్నివిధాలా ఆదుకునేందుకు కేంద్రం సిద్ధంగా ఉండటం ఆనందదాయకం.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే



ప్రజారంజక బడ్జెట్

దేశ ప్రగతిని మార్చే అద్భుతమైన ప్రజారంజకమైన బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. రైతులను ప్రోత్సహించే దిశగా నిర్ణయాలు తీసుకొని అడుగులు వేసింది. పేదలు, యువత, రైతులు, మహిళల పురోభివృద్దే లక్ష్యంగా కేంద్రం బడ్జెట్‌ను పార్లమెంటు ముందు ఉంచింది.

- అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు



రైతులకు వ్యతిరేక బడ్జెట్

కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. బడ్జెట్ కేటాయింపులలో వారి న్యాయమైన కోర్కెలు తీర్చటంలో కేంద్రం విఫలమైంది. పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చేలా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏదో మొక్కుబడిగా బడ్జెట్ ప్రవేశపెట్టి మేమేదో గొప్ప బడ్జెట్ ప్రవేశ పెట్టామని గణాంకాలు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం బడ్జెట్ అమలు కావటం లేదు. కొవిడ్ తర్వాత వ్యవసాయ రంగంలో అనేక మార్పులు వచ్చాయని చెబుతున్నా అవి ఎక్కడ అమలు చేశారో అర్థం కావటం లేదు. గతంలో రైతుల ఆందోళనలపరంగా ఆయా ఉద్యమకారులతో కుదుర్చుకున్న ఒప్పందాలు నేటికి పూర్తిస్థాయిలో అమలు కాలేదు.

- చేవూరు దేవకుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు



ఇది పూర్తిగా వ్యతిరేక బడ్జెట్

ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్. ఉన్నత వర్గాలకు, పారిశ్రామిక వేత్తలకే ప్రాధాన్యం ఇచ్చారు. బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో అధిక భాగం ఆ రాష్ట్రానికి కేటాయింపులు జరిగాయి. నిరు ద్యోగ సమస్య, నిత్యావసర వస్తువుల తగ్గింపు గురించి ఎక్కడా ప్రస్తావించ లేదు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక బడ్జెట్టే.

- మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి



విద్యకు తగినన్ని కేటాయింపులు లేవు

ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి చెందాలంటే జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పింది. కానీ బడ్జెట్‌లో ఆ పరిస్థితి లేదు. జాతీయ విద్యా విధానం విజయవంతంగా అమలు కావాలంటే విద్యకు జీడీపీలో 6 శాతం, బడ్జెట్‌లో 6 శాతం కేటాయించాలి. అలాగే వేతనజీవులకు ఇన్‌కం టాక్స్ డిడక్షన్ పెంపుదల కూడా అంకెల గారడిలా ఉంది తప్ప ఎలాంటి ఉపయోగం లేదు.

- జీవీ.చలపతిశర్మ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



రైతులు ఆశించిన బడ్జెట్ కాదు

సగటు రైతుకు లాభించే అంశాలేవీ ఈ బడ్జెట్‌లో లేవు. రూ.3లక్షల నుంచి 5లక్షల వరకు వడ్డీ రాయితీ రుణాల పెంపు ఎంతమంది రైతులకు వర్తిస్తుంది. 100 జిల్లాల్లో ధన ధాన్య కృషి యోజన పథకం ప్రయోగాత్మకంగా అమలు చేస్తామన్నారు.. కానీ విధి విధానాలపై స్పష్టత లేదు. రెండు యూరియా తయారీ ఫ్యాక్టరీలు ప్రారంభిస్తామన్నారు. వాటివల్ల రైతులకు ఎంతవరకు ప్రయోజనం ఉంటుంది.

- చిరసాని కోటిరెడ్డి, రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు



అన్నివర్గాల డ్రీమ్ బడ్జెట్

ఏపీకి ప్రాధాన్యత ఇస్తూ అన్ని వర్గాలకు సమన్యాయం చేసే డ్రీమ్ బడ్జెట్‌ను అందించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్లు, విశాఖ స్టీల్‌కు రూ.3,295 కోట్లు, విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు రూ.186 కోట్లు, ఏపీ ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి రూ.162 కోట్లు ఇలా రూ.వేల కోట్లు రాష్ట్రానికి కేటాయించడం ఆనందంగా ఉంది.

- ఎస్ వంశీధర్‌రెడ్డి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఉద్యమ పాటల హోరు.. శ్రేణుల్లో హుషారు!

- అట్టహాసంగా ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర మహాసభలు
- తరలివచ్చిన కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యులు
- పతాక యాత్రల జెండాలను అందుకున్న నేతలు
- అమరవీరుల స్మారక స్తూపం వద్ద నివాళులు
- తొలిరోజున 22 అంశాలకు తీర్మానం



సీపీఎం జెండాను ఎగరేసి సెల్యూట్ చేస్తున్న వామపక్ష నేతలు మధు, ఎంఏ బేబీ, బీవీ రాఘవులు, గపూర్, వి.శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు



సభా వేదికపై సీపీఎం అగ్రనేతలు ఎంఏ బేబీ, బీవీ.రాఘవులు ముచ్చట్లు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సీతారాం ఏచూరి ప్రాంగణంలో (అనిల్‌గార్డన్) మూడు రోజులపాటు ఈ సభలు జరగనున్నాయి. తొలుత సభా ప్రాంగణంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్ బ్యూరో సభ్యులు ఏంఎ బేబి, వెంకట్, పి.మధు, శ్రీనివాస్, ఎంఏ గఫూర్ పాల్గొని పతాక యాత్రల జెండాలను స్వీకరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద సీపీఎం నేతలు నివాళులు అర్పించారు. సభ ప్రారంభానికి ముందు ప్రజానాట్యమండలి సభ్యులు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి.

● ప్రభుత్వాలపై ఆగ్రహం

ఈ సభల్లో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఏంఎ బేబి, బీవీ రాఘవులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలకు అనుకూలంగా ఎన్నికల కమిషన్, ఈడీ, సీబీఐ వంటి సంస్థలతోపాటు కొన్ని మీడియా సంస్థలు కూడా అనుకూలంగా ప్రవర్తిస్తున్నాయని మండిపడ్డారు. వాటి ద్వారా కేంద్రం రాష్ట్రాలపై పెత్తనం చేస్తోందని విమర్శించారు. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాల నిర్వహణ ఆయా రాష్ట్రాలే నిర్వహిస్తుండగా, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం వాటిని పూర్తిగా స్వాధీనం చేసుకుని వీసీల నియామకం గవర్నర్లు చేపట్టేలా ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రం చేతుల్లోకి విశ్వవిద్యాలయాలు వెళితే వాటిపై పెత్తనం రాష్ట్రానికి ఉండదన్నారు. దీనిపై తెలుగుదేశం, జనసేన వైఖరి ఏంటో స్పష్టం చేయా లని డిమాండ్ చేశారు. వనరుల పంపిణీలో కేంద్ర వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వం నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. నేపాల్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వమే ఎన్నో సంస్కరణలు చేస్తోందని, అలాగే క్యూబా దేశంలో విద్యతోపాటు అన్ని రకాల వైద్య చికిత్సలు ఉచితంగా అందుతున్నాయని చెప్పారు. అదే తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణలు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. మరో రెండు నెలల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని 3వేల గ్రామాలలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని నేతలు వెల్లడించారు.



గీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి సభ్యులు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ 11 ఏళ్ల పాలనలో దేశంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. పారిశ్రామికవేత్తలు అంబానీ, అదానీలకు కొమ్ము కాసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. అలవికాని వాగ్దానాల వల్ల సీఎం చంద్రబాబు నిధుల కోసం వెంపర్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ చేసుకున్న విద్యుత్ ఒప్పందాల వల్ల రూ.1.75 లక్షల కోట్ల భారం ప్రజలపై పడుతుందని, ఈ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ విధ్వంసం, ఘర్షణ విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వివిధ రూపాలలో రాష్ట్రానికి కేంద్రం రూ.20వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని, ఆ డబ్బు రాష్ట్రానికి వచ్చేలా సీఎం చంద్రబాబు ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు. ఖాళీ స్థలాల్లో నిర్మితమైన ఇళ్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ బీజేపీ పొత్తులో ఉన్న పార్టీలు పునరాలోచించి తమ రాష్ట్ర భవిష్యత్తుపై దృష్టి సారించాలని హితవు పలికారు. రాజధాని నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వైసీపీ లాగా కాకుండా ఈ నిర్మాణం పూర్తి చేసి చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీలు ఐక్యంగా ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు 22 అంశాలతో సభలో ప్రతిపాదనలు చేయగా వాటిని పార్టీ నేతలు ఏకపక్షంగా తీర్మానించారు. కాగా, మహాసభ నిర్వహణకుగాను ఎస్ఎఫ్ఐ నాయకులు లక్ష రూపాయల విరాళాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నేతలు మూలం రమేష్, దామా అంకయ్య, మోహన్‌రావు, చంద్ర రాజగోపాల్, మంగలం పుల్లయ్య, వివిధ జిల్లాల నుంచి వచ్చిన సీపీఎం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద..



గ్రామసభలో రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న అధికారులు

ప్రాణాలైనా ఇస్తాం.. భూములు ఇవ్వం

- అధికారులకు తేల్చి చెప్పిన అన్నదాతలు

కావలి రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటయ్యే పరిశ్రమల కోసం రెండు పంటలు పండే మా భూములు లాక్కుని మా పొట్ట కొట్టవద్దు.. ప్రాణాలైనా ఇస్తాం.. భూములు మాత్రం ఇవ్వం" అంటూ కావలి మండలం చెన్నాయపాలెం రైతులు అధికారులకు తెగేసి చెప్పారు. గ్రామంలోని సచివాలయం వద్ద శనివారం భూసేకరణపై జరిగిన గ్రామసభలో ఏపీ మారిటైం బోర్డు డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తహసీల్దార్లు శ్రావణ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెండు పంటలు పండే భూములు మీకిచ్చి మేము ఎటుపోవాలని నిలదీశారు. మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనే రైతు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ఇక్కడ ఎకరా భూమి విలువ రూ. 35 లక్షలు ఉందని రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెంచకపోవటంతో నష్టపోతామన్నారు. భూమి విలువ పెరిగినా రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెంచక పోవటం అధికరారుల తప్పిదమేనని అన్నారు. నాగన్నగారి శ్రీను మాట్లాడుతూ అమరావతి రైతులకు పరిహారం అందించినట్లు ఇక్కడ రైతులను కూడా పెట్టబోయే పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో భాగస్వాములుగా చేయాలని డిమాండ్ చేశారు. పొన్నాతి చలపతిరావు మాట్లాడుతూ పెదపట్టపుపాలెం, చెన్నాయపాలెం, ఆనెమడుగు పంచాయతీల నుంచి సుమారు 12వేల మంది రైతులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.

కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

- 8 రోజుల ప్రయాణానికి టికెట్ ధర రూ.9వేలు
- అయోధ్య, వారణాసిలలోనూ దైవదర్శనాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో ప్రతిష్టాత్మకంగా జరుగు తున్న కుంభమేళాకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు-1 డిపో మేనేజరు మురళీకృష్ణ తెలిపారు. శనివారం నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కుంభమేళాకు సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందని చెప్పారు. హైదరాబాద్, నాగపూర్ మీదుగా 9వ తేదీ సాయంత్రానికి కుంభమేళాకు బస్సు చేరుకుంటుందన్నారు. తిరిగి 10వ తేది ప్రయాగ్‌రాజ్‌లో బయలుదేరి 11వ తేది రాత్రి అయోధ్యకు చేరుకుంటుం దన్నారు. 12వ తేదీ ఉదయం అయోధ్యలో బాలరాముడి దర్శించుకుని రాత్రి వారణాసికి బయలు దేరుతుందన్నారు. 13వ తేదీన వారణాసిలో బస, 14వ తేది ఉదయం బస్సు బయలుదేరి 15వ తేదీ రాత్రి నెల్లూరుకు చేరుకుంటుందన్నారు. ఈ 8 రోజుల ప్రయాణానికి ఒకరికి రూ.9 వేలు టికెట్ ధర నిర్ణయించినట్లు చెప్పారు. టీ, టిఫిన్, భోజనం, వసతి ఇతర ఖర్చులు ఎవరికివారుగా పెట్టుకోవాలన్నారు. కుంభమేళాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుకు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని చెప్పారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఈఎన్‌సీ మరియన్న

వేసవి దాహార్తి తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేయండి : ఈఎన్‌సీ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వకుండా తగిన ప్రణాళికలు తయారు చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ మరియన్న తెలిపారు. శనివారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన కార్పొరేషన్ల ఇం జనీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓవర్‌హెడ్ ట్యాంకులు, డైరెక్ట్ పంపింగ్ స్కీంలు, స్టోరేజ్ ట్యాంకులను ఇప్పుడే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. రోడ్లపై గుంతలు లేకుండా ప్యాచ్ వర్కులు పూర్తి చేసి సాఫీ ప్రయాణానికి వీలు కల్పించాలన్నారు. అమృత్ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజల ప్రయోజనార్థం అవసరమైన చోట్ల సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ప్రణాళికలు తయారు చేసి, అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు, ఈఈ, డీఈఈలు పాల్గొన్నారు.

హైవే మార్జిన్‌లోనే హైవోల్టేజి విద్యుత్ లైన్

● తొలుత ఫారెస్టు భూముల్లో అనుకున్నారు
● వారి అడ్డగింపుతో జాతీయ రహదారిపై స్తంభాల ఏర్పాటు

ఉలవపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):జా తీయ రహదారి మార్జిన్‌కు ఆనుకుని 33కేవీ హై ఓల్టేజీ విద్యుత్ సరఫరా స్తంభాలను ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధంగా ఉందని స్థానిక ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. వీటితో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

● గతేడాది స్తంభాల ఏర్పాటు

మండలంలోని మన్నేటికోట వద్ద ఉన్న 132 కేవీ విద్యుత్ స్టేషన్ నుంచి గుడ్లూరు మండలం చేవూరు వద్ద నిర్మాణంలో ఉన్న ఇండోసోల్ సోలార్ ప్యానల్ తయారీ సంస్థ వరకు ఎత్తైన టవర్లు నిర్మించి గత ఏడాది విద్యుత్ సరఫరాను ప్రారంభించారు.

● 20 అడుగుల దూరంలో..

ఈ టవర్ల నిర్మాణమంతా జాతీయ రహదారి వెంట మార్జిన్‌కు 20అడుగుల దూరంలో నిర్మించారు. రాజుపాలెం, చాగొల్లు, వీరేపల్లి గ్రామాల వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఫారెస్టు భూమలున్నాయి. ఫారెస్టు భూముల్లో నుంచి టవర్లు వేసేందుకు తొలుత నిర్మాణాలు చేపట్టారు. ఫారెస్టు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని వారు పనులు నిలిపేశారు. విద్యుత్ సరఫరా ఎస్టిమేట్‌లో ఇలాంటి వెసులుబాటు లేకున్నా టవర్లు బదులు తక్కువ ఎత్తులో ఉన్న స్తంభాలతో విద్యుత్ లైన్‌లు వేశారు. భవిష్యత్తులో జాతీయ రహదారిపై వెళ్లే వాహ నదారులకు పెను ప్రమాదం పొంచిఉందని ప్రజ లు చర్చించుకుంటు న్నారు. ఫారెస్టు భూ ముల హద్దు వెంట తాటిచెట్లు, ఏపుగా ఎదిగిన జామాయిల్ చెట్లు పెరిగి ఉన్నాయి. వర్షాకాలం సమ యంలో బలమైన గాలులు వీచినప్పుడు స్థంభాలు హైవే పైకి వాలే ప్రమాదం లేకపోలేదు. ప్రమాదవశాత్తు అతి వేగంగా వస్తున్న వాహానాలు ఢీకొన్న సమయం లో రోడ్డు మార్జిన్ దాటే క్రమంలో విద్యుత్ స్థం భాలను ఢీకొట్టినా హై ఓల్టేజ్ తీగలు వాహ నాలపై పడితే క్షణాల్లో ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది.

● పూర్తి సమాచారం తెలియదు

నేషనల్ హైవే అథిరిటీకి చెందిన కొందరు అధికారులను ఈ విషయమై ప్రశ్నించగా... ఏ ప్రాతిపదిక మీద అనుమతులు ఇచ్చారో తెలియదని, ఉన్నతాధికారులను అడిగితే కానీ పూర్తి సమాచారం తెలియదని దాటవేశారు. జాతీయ రహదారి ఫెన్సింగ్ దాటి ఎలాంటి నిర్మాణం చేపట్టినా వెంటనే ఆ ప్రాంతంలో వచ్చి వాలిపోయే హైవే అథారిటీ అధికారులు వాహనదారులకు ప్రమాదం ఉందని, నిబంధనలకు విరుద్ధంగా మార్జిన్‌లో హై వోల్టేజ్ విద్యుత్ సరఫరా చేపట్టడంలో ఉన్నతస్థాయి అధికారులు, హై లెవల్ హైవే అథారిటీ మధ్య మతలబులు జరిగి ఉంటుందని ఆ శాఖల సిబ్బంది చర్చించుకోవడం విశేషం.


వీరేపల్లి జాతీయ రహదారిపై వెలసిన హై వోల్టేజి విద్యుత్ స్తంభాలు

న్యూస్ బాక్స్

మాలకొండ ఆదాయం రూ.5.32 లక్షలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.5.32లక్షల ఆదాయం వచ్చినట్లు ఆల య డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్లు, కుంకుమార్చన, వివాహాలు, తల నీలాలు, వాహనపూజ, ప్రత్యేకదర్శనం, లడ్డూ ప్రసాదం, అన్నదానం తదితర వాటిపై ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

పాఠశాల తరలించరాదు

బిట్రగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు ప్రాథమిక పాఠశాలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను కొండబిట్రగుంట పాఠశాలకు తరలించరాదని విద్యాకమిటీ చైర్మన్ ఎస్‌డీ నాసీరా తెలిపారు. శనివారం ఈ విషయంపై ఎంఈవో నరసింహారావుకు వినతిపత్రం అందచేసి సమస్యలను వివరించారు. అలాగే కావలి ఆర్డీవో, ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి కలిసి వినతులు అందజేశారు.

రావి కుటుంబీకుల పూజలు

బిట్రగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొండబిట్రగుంట బిలకూట క్షేత్ర ముఖద్వారానికి (ఆర్చీ) శనివారం రావి కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణాచార్యులు, టీడీపీ నేత రావి విజయ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. గ్రామపెద్దల అనుమతితో సొంత నిధులతో ఆర్చీకి నూతన రంగులు వేయనున్నట్లు రావి చిన్నరంగయ్య తెలిపారు. కార్యక్రమంలో రావి పెద్ద రంగయ్య, గ్రామస్థులు ఉన్నారు.

అనుమతులు లేని లేఅవుట్లపై ఉక్కుపాదం

బిట్రగుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ పరిధిలో నుడా అనుమతులు లేని లేఅవుట్లపై మండల అధికారులు శనివారం ఉక్కుపాదం మోరు. కప్పరాళ్ళ తిప్ప జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేని లేఅవుట్ల ప్రధాన ద్వారాల వద్ద ఎంపీడీవో సుబ్రమణ్యం, ఈవోపీఆర్డీ నయీమ్ తాజ్ హసన్, కార్యదర్శి జహీర్‌లు జేసీబీలో నిరోధక కాలువలు తవ్వించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బోగోలులో 10 లేఅవుట్లు, జువ్వలదిన్నెలో వేసిన మూడు లేఅవుట్లకు నుడా అనుమతులు లేవన్నారు.

ఇసుక డంపింగ్ యార్డు పరిశీలన

సంగం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇసుక డంపింగ్ యార్డును శనివారం ఆర్డీవో పావని పరిశీలించారు. సంగం పెన్నానదిలో పడవల ద్వారా డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తీసేందుకు ఓ సంస్థ అనుమతి పొంది డంపింగ్ యార్డుకు ఇసుక తరలిస్తున్న విషయం విదితమే. ఈసందర్భంగా ఆమె రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇసుక డంపింగ్ యార్డులో రికార్డులు పరిశీలించారు. ఇప్పటి వరకు డంపింగ్ యార్డుకు తరలించిన ఇసుక, విక్రయించిన వివరాల నమోదు, నిల్వ ఉన్న ఇసుక రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దారు సోమ్లా నాయక్, వీఆర్వో సప్తగిరి ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఉదయగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి, దత్తాత్రేయస్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా వేదపండితులు గణపతి పూజ, హనుమాన్ చాలీసా పారాయణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

కొండాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలను ఎంఈఓ-2 ఆనందరావు శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల సమగ్ర వివరాలను పొందుపరచాలని ప్రిన్సిపల్ ఖాదర్‌భాషాకు సూచించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఆరా తీసి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలో వందశాతం ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు సాధించేలా విద్యార్థులను తయారుచేయాలన్నారు.

'రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం'

కావలి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 7నెలలు కావస్తున్నా రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా ఉండి గాడి తప్పిందని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. శనివారం ముసునూరులోని ఆయన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో లక్షలాదిమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురి అవుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై ఈనెల 5న ఫీజు పోరు ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌తో వ్యాపార అభివృద్ధికి పరోక్ష సహకారం

టెక్స్‌టైల్ రంగంపై మార్పుల్లేవు



కావలి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థికబడ్జెట్‌లో టెక్స్‌టైల్ రంగంపై వడ్డింపులు, రాయితీలు ప్రకటించలేదు. 5శాతం జీఎస్టీ విధించడంతో వ్యాపారం తగ్గుముఖం పడుతోంది. టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి కేటాయింపులు.. రాయితీలు ప్రకటించి ఉంటే అభివృద్ధికి దోహదపడేది. ఏపీలో స్పిన్నింగ్, జిన్నింగ్ పరిశ్రమలున్నా టెక్స్‌టైల్ పార్కు లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు ముడిసరుకు తరలించాల్సిన పరిస్థితి. ఏపీలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయించడం పేద మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగే అవకాశం ఏర్పడింది. ఇది వస్త్ర వ్యాపారానికి ఊరటనిచ్చే అంశం.

● అమరా సుబ్బారావు, ఏపీ జీఎస్టీ గ్రీవెన్సెస్ బోర్డు మెంబర్

వేతన జీవులకు వరం

● కందుకూరు:వార్షికఆదాయ పరిమితిని పెంచి రూ.12లక్షల వరకు వార్షిక ఆదాయం కలిగిన వారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా చేయటం వేతనజీవులకు ఎంతో ఊరట. నెలకు రూ.లక్ష వరకు వేతనం వచ్చేవారు ఎలాంటి పన్ను చెల్లించకుండా మినహాయింపు ఇవ్వటం వల్ల కొనుగోలు శక్తి పెరిగి జీడీపీ వృద్ధికి దోహదపడుతుందన్నారు. అలాగే సా మాన్య ప్రజలకు నిత్యావసరాలుగా మారిన సెల్‌ఫోన్లు, టీవీల ధరలు తగ్గే లా అత్యవసరమైన 30రకాల మందుల ధరలు తగ్గేలా తీసుకున్న నిర్ణయం కూడా సామాన్య, మ ధ్యతరగతి ప్రజలకు ఊరట అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటా యించటంతో పాటు ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను కూడా కేంద్రమే తీసుకోవటం మేలు.

- మన్నేపల్లి వరప్రసాదరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు

మధ్య తరగతి ప్రజలు బడ్జెట్



కందుకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీ తారామన్ 8వ సారి ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులతో ఇచ్చే పంట రుణాల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచటం, పప్పుదినుసుల అభివృద్ధికి ప్రోత్సాహకాలు ప్రకటించటంతో రైతు ఆదాయాన్ని పెంచేందుకు ఉపకరిస్తుంది.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు

వస్త్ర వ్యాపార అభివృద్ధికి సహకారం



కావలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పరోక్షంగా వస్త్ర వ్యాపార అభివృద్ధికి సహకారంగా ఉంది. మేజర్ అండ్ స్మాల్ ఇండస్ట్రీలకు కేంద్రం రుణ సదుపాయం రూ.5కోట్ల నుంచి రూ.10కోట్ల వరకు పెంచటం హర్షణీయం. గత మానవత ఉత్పత్తి యూనిట్లకు ఉన్న కస్టమ్స్ డ్యూటీని తీసివేయటంతో కొత్త యూనిట్ల ఏర్పాటుకు సహకారంగా ఉంటుంది. విదేశీ వస్త్రాలపై కస్టమ్స్ డ్యూటీ పెంచటంతో మన దేశ వస్త్రాలకు డిమాండ్ పెరుగుతోంది. ఆదాయపన్ను పరిమితిని రూ.12లక్షల వరకు పెంచటంతో పేద, మధ్య తరగతి ప్రజల కొనుగోలుశక్తి పెరిగి వస్త్ర వ్యాపారం పెరిగేందుకు అవకాశం ఏర్పడుతోంది.

- కందుకూరి వెంకటసత్యనారాయణ, కందుకూరి గ్రూప్ ఆఫ్ కంపెనీల చైర్మన్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే ఇంటూరి


ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వలేటివారిపాలెం: ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మా లకొండ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మర్యాదలతో స్వాగతం పలికి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆలయ అభివృద్ధి పనులు, మహాన్నదానం, ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట కందుకూరు టౌన్ ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్, టీడీపీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్, పొడపాటి నరసింహం, పొడపాటి శంకరయ్య వడ్డెళ్ల రవిచంద్ర, కామినేని అశోక్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఉద్యోగంలో కొనసాగించేలా చూడాలని వినతి

మాలకొండలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న మమ్మల్ని ఉద్యోగంలో నుంచి తొలగించకుండా చూడాలని త్రాసుల శ్రీనివాసులు, పెగడా మల్లికార్జునరావు, ఆవుల మల్లికార్జునరావు, మారుపాకుల మల్లికార్జునరావు, కళ్లగుంట రాజేష్‌లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కందుకూరు: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ఎస్సీ కుటుంబాలకు చెందిన వారు వైసీపీకి రాజీనామా చేసి శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారందరికీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో పట్టణంలోని బృందావనం కాలనీకి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు దాసరి మాలకొండయ్య, గుడ్లూరు మండలం పరకొండపాడు పంచాయతీ అగ్రహారం పులి మహేంద్ర, పులి నారాయణ, మన్మథరావు, హరిశ్చంద్రప్రసాద్, మనోే, మాలకొండయ్య, గంధం మాలకొండయ్య, కొండారెడ్డిపాలెం హరికృష్ణలు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, తలతోటి మస్తాన్, చనమాల శ్రీధర్, పులి నాగరాజు, శ్యామ్, ఏపూరి కృష్ణ, వడ్డెళ్ల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మండలానికి రూ.1.2కోట్లతో ఓవీ రోడ్డులోని మాల్యాద్రి కాలనీ వద్ద నుంచి మహదేవపురం వరకు.. రూ.2కోటతో పలుకూరు అడ్డ రోడ్డు నుంచి పలుకూరు వరకు తారురోడ్డు నిర్మాణ పనులు జరుగుతాయని అధికారులు తెలిపారు.

హైదరాబాద్ సభకు తరలిరండి

కావలి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంపై స్థానిక మాగుంట పార్వతమ్మ రోడ్డులోని మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్ల దద్దరిల్లాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చేవూరు కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంద కృష్ణ ఆదేశాల మేరకు ఈనెల 7న హైదరాబాద్‌లో 'లక్షల డప్పులు.. వేల గొంతులు' అనే భారీ సాంస్కృతిక ఉద్యమానికి సంభందించిన వాల్‌పోస్టర్‌ను గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, మంద వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు జీ వెంకటేశ్వర్లు, పందిటి అంబేద్కర్ మాదిగ, గేరా జానకి, అక్కిలిగుంట యేసు పాల్గొన్నారు.

● లింగసముద్రం: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జరిగే లక్ష డప్పులు, వేల గొంతులు బహిరంగ సభకు మండలంలోని మాదిగ యువకులు వేలాదిగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసింగరావు మాదిగ పిలుపునిచ్చారు. ఈ విషయంపై శనివారం రాత్రి వరకు గంగపాలెం, జంపాలవారిపాలెం, పెంట్రాల మొగిలిచెర్లలో నాయకులతో పర్యటించారు. కార్యక్రమంలో ప్రవీణ్, బ్రహ్మయ్య, సురేష్, కుమార్, ముసలయ్య, రాజేష్ ఉన్నారు.

బీజేపీ పట్టణ శాఖ కార్యాలయం ప్రారంభం


కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నేతలు

కావలి టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ శాఖ కార్యాలయంను శనివారం స్థానిక జేడీ కాంప్లెక్స్‌లో ప్రారంభోత్సవం చేపట్టారు. ఆ శాఖ నూతన అధ్యక్షుడిగా మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమంలో సీనియర్ నాయకులు అమరా సుబ్బారావు, జిల్లా నాయకులు బ్రహ్మానందం పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం గొప్ప ఆర్థికశక్తిగా అవతరించనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ వలే పని చేయడంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు సీవీసీ సత్యం, కమల, వెంకటేశ్వర్లు, భక్తవత్సల రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల మృతి

ఉలవపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆర్భావం నుంచి తొలితరం నాయకుడు ఆత్మకూరు దామచర్ల సుబ్బారావు శనివారం మధ్యాహ్నం గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు, నాయకులు సుబ్బారావు ఇంటికి చేరుకొని సంతాపం తెలిపారు. ఆయన మరణం మాలాంటి సీనియర్ సిటిజన్స్‌కి తీరనిలోటని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు అన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

సుబ్బారావు మృతి పార్టీకి తీరనిలోటు : ఇంటూరి

అనంతరం టీడీపీ సీనియర్ నేత దామచర్ల సుబ్బారావు మృతి పార్టీకి తీరని లోటని నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆత్మకూరుకు వెళ్లి సుబ్బారావు మృతదేహానికి నివాళ్లు అర్పించారు.

విజయవంతంగా లబ్ధిదారుల ఇళ్లకే పింఛన్ పంపిణీ

సంగం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఇచ్చే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె మండలంలోని సంగం అనుబంధ గ్రామమైన వెంకటేశ్వరపురంలో ఫిబ్రవరి నెల పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీవో షాలెట్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంతో ఇబ్బందులు : యూటీఎఫ్

ఆత్మకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.117 రద్దు పేరుతో పాఠశాలల విలీనంతో ఇబ్బందులు తప్పవని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం వారు ఎంఈవో చలపతికి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు ఎస్ మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాల పేరుతో రాష్ట్రంలో ఉన్న అన్ని పాఠశాలలను విలీనం చేసి మిగిలిన పాఠశాలలను 1, 2 తరగతులతో కొనసాగించాలని ప్రతిపాదనలు చేస్తోందని, దీనివలన సామాజికంగా వెనుకబడిన పిల్లలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అదే క్రమంలో ఉర్దూ మీడియం పాఠశాలలను విలీనం చేయడం వలన విద్యార్థులకు ఉర్దూ భాషను దూరం చేసినట్లవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు హెచ్ మురళీకృష్ణ, షేక్ ఇమామ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థికి విద్యుత్ షాక్


వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

లింగసముద్రం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థి పల్లిపాటి సందీప్ శనివారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో గాయపడ్డాడు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లోని 8వ తర గతి చదివే సందీప్ హైస్కూల్ పూర్తయిన అనంతరం పక్కనే ఉన్న జంగంరెడ్డిపాలెం మీదుగా హాస్టల్‌కు వెళుతున్నాడు. చింతకాయల కోసం రోడ్డుపైనే ఉన్న చెట్టు ఎక్కా డు. ఈ చెట్టు గుండా వెళుతున్న సింగిల్ ఫేస్ విద్యుత్ తీగలు గమనించలేదు. తీగలు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై చెట్టుపై నుండి కిందపడ్డాడు. ఈ సంఘటనలో సందీప్ వీపు, చేతులు, కాళ్లు కాలిపోయాయి. విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది సందీప్‌ను లింగసముద్రం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం సందీప్‌ను 108 వాహనంలో కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి విషయాన్ని సందీప్ తల్లిదండ్రులకు తెలిపారు. వారు కందుకూరు వైద్యశాల వద్దకు చేరుకొని అక్కడ నుండి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఇన్‌చార్జ్ వార్డెన్ సీహెచ్ శ్రీనివాసులు, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

జలాశయాలను పూర్తి చేయాలి


ఆందోళన చేస్తున్న రైతులు, కూలీలు

ఉదయగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలను పూర్తిచేయాలని శనివారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు, కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఉదయగిరిలో బంగారం పండే భూములున్నా సాగునీరు లేక బీళ్లుగా మారి ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారన్నారు. 8టీఎంసీల సామర్థ్యం గల సీతారాంసాగర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.850 కోట్ల నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించిన దాఖల్లాలేవన్నారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు రూ. 2వేల కోట్లు అవసరం కాగా రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆయా జలాశయాలకు నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టి తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దాసరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని శనివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు మాజీ సర్పంచ్ సయ్యద్ జమృత్‌జాఫర్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో పీఎంసీ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. 9, 10వ తరగతుల కోసం 7 కిలో మీటర్ల దూరంలో ఉన్న దుత్తలూరు, ఉదయగిరికి వెళ్లాల్సి వస్తోంద న్నారు. ఎమ్మెల్యే స్పందించి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

సర్వేలను సత్వరం పూర్తిచేయండి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ సర్వేలను వెంటనే పూర్తిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి సూచించారు. శనివారం ఆమె హసనాపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. మొదటిరోజే నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఏరియా కోఆర్డినేటర్ రత్నమ్మ, ఏపీఎం సతీష్, పెన్షన్ పంపిణీ అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కాకర్ల


గంగమ్మతల్లికి జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్‌లతో కలిసి పొన్నెబోయిన చెంచు రామయ్య గండిపాళెం జలాశయం నుంచి సాగునీరు విడుదల చేశారు. తొలుత గంగమ్మ తల్లికి జలహారతి ఇచ్చారు. గండిపాళెం గ్రామంలో సీసీరోడ్లు, గోకులంషెడ్, వెంగళరావునగర్‌లో సిమెంట్‌రోడ్ల ప్రారంభోత్సవం చేసి అనంతరం పింఛన్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గండిపాళెం జలాశయాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూస్తామన్నారు. జలాశయ ఆవరణలో దివంగత మాజీ ఎమ్మెల్యే పొన్నెబోయిన చెంచురామయ్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్లు బయ్యన్న, మధు, గండిపాళెం జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, ఐటీడీపీ నియోజకవర్గ కన్వీనర్ రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రమౌళి, నాయకులు ఏ వెంకటేశ్వర్లు, ఆర్ నరసింహారావు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పట్టణ అభివృద్ధి

● సీ గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు



ఆత్మకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి, ఆత్మ కూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఆత్మకూరు మున్సిపాల్టీలో మౌలిక వసతులు కల్పించడం తోపాటు ఎన్న డూలేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తు న్నామని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు.

? అమృత్ 2.0 పథకం నిధులు ఎన్ని మంజూరయ్యాయి.

! ఆత్మకూరు మున్సిపాల్టీకి అమృత్ 2.0పథకం కింద రూ. 15 కోట్లు నిధులు మంజూర య్యాయి. ఎంఎల్‌డి వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, స్టోరేజ్ రిజర్వా యర్స్ ఇంటింటి తాగునీటి కనెక్షన్లు, ఆత్మ కూరు చెరువు ట్యాంక్‌బండ్ అభివృద్ధి, పార్కు అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

? నుడా నిధులెన్ని వచ్చాయి.

! నుడా ద్వారా రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మున్సిపాల్టీ పరిధిలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం చేపడతాం.

? తాగునీటి సరఫరా పరిస్థితి ఏమిటి.

! ఆత్మకూరు పట్టణంలో అన్ని ప్రాంతాల్లో ప్రతిరోజూ రక్షిత నీరందిస్తున్నాం. మంచినీటి సమస్య లేదు.

? పారిశుధ్యం మెరుగుదలకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

! మున్సిపాల్టీలోని అన్ని వార్డుల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు పకడ్బందీగా చేపడుతున్నాం. ఇళ్ల వద్దకు వెళి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాం. దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం.

అడవి ఆవులను గోశాలలకు అప్పగిస్తాం

ఆత్మకూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో రోడ్లపై సంచరించే అడవి ఆవులను గోశాలలకు, వ్యక్తిగతంగా పెంచుకునే వారికి అప్పగించాలని నిర్ణయించామని మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ తెలిపారు. కొన్ని అడవి ఆవులు నిత్యం రోడ్లపై సంచరిస్తూ వాహనాలకు అడ్డుగా రావడంతో పాటు ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈక్రమంలో ఒక మారు ఆవులను అడవులలో వదిలినా తిరిగి ఆత్మకూరు పట్టణంలోకి వచ్చాయన్నారు. ఈసమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు వాటిని గోశాలలకు, వ్యక్తిగతంగా పెంచుకునేవారికి అప్పగిస్తామని తెలిపారు. అనంతరం వాటి సంరక్షణ తీరును పరిశీలిస్తూ ఉంటామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత

మర్రిపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఆత్మకూరు సీఐ గంగాధర్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు మర్రిపాడు బస్టాండ్ సెంటర్లో బారికేడ్లకు రేడియం స్టిక్కర్‌ను ఎస్‌ఐ శ్రీనివాసులు ఏర్పాటుచేశారు. వాటిని సీఐ పరిశీలించి వాహనదారులు నిదానంగా వెళ్లాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలను వాహనదారులకు వివరించారు.

మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

సీతారామపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో మస్తాన్‌వలి సూచించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఫైబర్‌నెట్ మెటీరియల్, జియో సిమ్‌లు, బాత్రూం క్లీనింగ్ కెమికల్స్‌ను మండలంలోని 40 పాఠశాలలకు ఎంఈవో పంపిణీ చేశారు.

వైభవంగా జీర్ణోద్ధరణ పూజలు

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాగా, ఆదివారం త్రిదండి చిన్నజీయర్‌స్వామి ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు